# జాతీయ స్ఫూర్తి

పక్షపత్రిక

2019, అక్టోబరు 1-15

వెల : రూ.15/-

ప్రశ్నను చంపేవాడే దేశద్రోహి

జాతిపిత – పితామహ !

గాంధీ – గో సంరక్షణ

మహాత్మాగాంధీ మతం ఏమిటి ? గాంధీ దృష్టిలో దేవుడు ఎవరు ?

గాంధీ రచనలలో గ్రామ స్వరాజ్యము

స్వరాజ్యం – స్వపరిపాలన

గాంధీని యువతరం గ్రహించగలుగుతుందా ?

మహాత్ముడు – ఆర్.ఎస్.ఎస్.

గాంధీ ముస్లిం భాయ్... భాయ్

కమ్యూనిస్టులకు బాపూ స్ఫూర్తి

సత్యాగ్రహం

అర్థశాస్త్ర విమర్శ ముందు మాట

న్యాయమైన రోజు పనికి – న్యాయమైన రోజు కూలి

# మహాత్మాగాంధీకి కవితా నీరాజనం



## బాపూజీ

- జాషువా



భరతవర్షంబీను వజ్రాల ధనరాశి
తూకంబునకు పెచ్చుదూగువాడు
మూడుమూర్తుల దయాభూతి ప్రత్యంగాన
తాండవించెడు పవిత్రస్వరూపి
పదివేలయేండ్ల లోపల ధరాదేవత,
కనియెఱుంగని జగన్మునివరుండు
అనుగు దమ్ములు కోరుకొను స్వరాజ్యార్థమై
పస్తుండి శుష్కించు పండుముసలి
గోచిపాత గట్టుకొని జాతి మానంబు
నిలిపినట్టి ఖదరు నేతగాడు
విశ్వసామరస్య విజ్ఞాన సంధాత
కామిత ప్రదాత, గాంధితాత!

విమత భూపతుల దోపిడి గుందు జాతిలో
దీపంబు బెట్టిన దినకరుండు
మానవత్వమును భూమండలంబున నెల్ల
చాటిన యాచార్య చక్రవర్తి
సత్యాగ్రహంబను శస్త్రచాలన విద్య
భువికి దెచ్చిన మహాపురుషమౌళి
నిమ్న జాతుల కంటి నీరంబు దుడిచి యా
శ్వాసించు నిఱు పేద బాంధవుండు
పండ్లు నూరుచున్న బహుమతంబులలోన
సహనవిద్య నేర్పు సాధకుండు
భార్య బిడ్డలున్న ప్రత్యక్ష దైవంబు
కామిత ప్రదాత, గాంధి తాత

సత్యాగ్రహ స్వర్ణశంఖంబు పూరించి
స్వాతంత్ర్య సమర బీజములు నాటి
సీమబట్టలు ధరించెడు పుట్టుభోగికి
చేనేతి మగ్గాలు చేతికిచ్చి
దొరల చేజిక్కిన భరత సామ్రాజ్యంబు
నుపవాసములచేత నూచి యూచి
స్వీయదేశీయ సిపాయి ఖైదీయౌట
గౌరవంబను సుద్దు గట్టిజేసి
పొదలు మంచుకొండ మొదలు సేతువుదాక
భారతంబు వెంట బరుగులెత్త
జడుపుగిడుపు లేని శాంతిపటాలంబు
సిద్ధపరచె ధర్మ బద్ధుడగుచు

## మహాత్మా

- దాశరథి



కత్తి లేక దురాత్మ కుత్తుకల్ నరికెడి
నీ నేర్పు లే వీరునికి లభించు?
ఉపవాస వహ్నిచే యపకారి గుండెల
బూది చేయుట లన్య పురుషు తరమె?
తీయని యొక మాటచే, యావ దవనిని
చేపట్టు టెవ్వని చేతనగును?
గుడిసెలో కూర్చుండి గుడిలోని దేవుని
మహిమల మించుటే మనిషి వశము.
దుర్బలుడవయ్యు నెంతటి దోర్బలమ్ము
పేదవై కూడ నెంతటి పెద్దతనము
ముదుసలివె యయ్యు నెంతటి కదన పటిమ
తాతవయ్యును మా కెల్ల నేతవోయి.

జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక

నిడదవోలు వెంకటేశ్వరరావు, ప్రచురణకర్త

2019 అక్టోబర్ 1-15 సంపుటి : 28 సంచిక : 1

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

డా॥ బి. రమేష్‌చంద్రబాబు

కొప్పర్తి వెంకట రమణమూర్తి

డి. సోమసుందర్

మందలపర్తి కిషోర్

వెల : 15/- రూపాయలు

ఈ సంచికలో...

4 ప్రశ్నను చంపేవాడే దేశద్రోహి - మాడభూషి శ్రీధర్
5 జాతిపిత - పితామహ ! - మందలపర్తి కిషోర్
6 గాంధీ - గో సంరక్షణ - కొప్పర్తి
9 మహాత్మా గాంధీ మతం ఏమిటి ? - కుమార్ ప్రశాంత్
11 గాంధీ రచనలలో గ్రామ స్వరాజ్యము
13 స్వరాజ్యం - స్వపరిపాలన - అజేయ కల్లం
15 గాంధీని యువతరం గ్రహించ గలుగుతుందా ? - అవిజిత్ పాథక్
17 మహాత్ముడు ఆర్.ఎస్.ఎస్. - రామచంద్ర గుహ
20 గాంధీ ముస్లిం భాయ్.. భాయ్ - సయ్యద్ నశీర్ అహ్మద్
22 కమ్యూనిస్టులకు బాపూ స్ఫూర్తి - పుచ్చలపల్లి సుందరయ్య
23 సత్యాగ్రహం - పెద్దిభొట్ల సుబ్బరామయ్య
27 అర్థశాస్త్ర విమర్శ ముందుమాట - కార్ల్‌మార్క్స్
30 న్యాయమైన రోజు పనికి న్యాయమైన రోజు కూలి - ఎంగెల్స్

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడి ప్రతి | రూ. 15-00 |
| చందా వివరాలు : | |
| 2 సంవత్సరాలకు | రూ. 500-00 |
| 1 సంవత్సరానికి | రూ. 300-00 |
| విద్యార్థులకు | రూ. 150-00 |

చందా డి.డి. లేదా మనియార్డరు ద్వారానే పంపండి. చెక్కులు పంపరాదు

Bank A/c No.3620 101 0000 380
Syndicate Bank, Eluru Main Branch
IFSC Code : SYNB0003620

పంపవలసిన చిరునామా :

డా॥ బి. రమేష్‌చంద్రబాబు
క్రాంతి నర్సింగ్ హోమ్
నన్నయ్య విగ్రహం వద్ద, మెయిన్‌రోడ్
తణుకు - 534 211
✆ 08819 222265, 93971 14495

# సత్య శోధనే గాంధీ మార్గం

గాంధీజీ 150వ జయంతి ఉత్సవాలు ముగిశాయి. గాంధీ మీద ప్రశంసలు, విమర్శలు, వికృత వాఖ్యానాలు మరోసారి తెర ముందుకు వచ్చాయి. గాంధీజీ ప్రకటనలలో, రచనలలో అనేక వైరుధ్యాలు కనిపిస్తాయి. అవే ఈ విమర్శలకు ప్రతి విమర్శలకు ఆధారాలు అవుతున్నాయి. గాంధీజీలోని ఈ వైరుధ్యాలకు మూలం ఏమిటి? అన్నదే కీలకమైన అంశం.

గాంధీ తన ఆత్మకథకు "సత్యంతో నా ప్రయోగాలు" అని నామకరణం చేసుకున్నారు. కొందరు దానిని సత్యశోధనగా అనువదించారు. ఈ సత్యశోధన వల్లనే గాంధీజీ భావజాలం అనేక మార్పులకు గురైంది. అందుకే అది వైరుధ్యాల పుట్టగా కనిపిస్తుంది. సత్యశోధకులకూ కొన్ని పరిమితులుంటాయి. వారి గత కాలపు భావజాల పరిమితులు వుంటాయి. ఈ శోధనలో ఒక సత్యం బయటపడినా గత కాలపు మేధ దానిని విస్మరిస్తుంది. మరికొందరు తమకు సత్యంగా తోచిన దానికి అనుగుణంగా గత భావాలను చక్కదిద్దుకుంటారు. గాంధీజీ ఈ రెండో తరహాకు చెందుతారు. ఆదిలో దేవుడే సత్యం అన్నారు గాంధీ. కాని సత్యశోధనలో అన్ని మతాల సారమూ ఒక్కటే అని తేలగానే తన పాత భావనను తానే తిరగ రాసుకున్నారు. దేవుడే సత్యం అన్నది సత్యమే నా దేవుడు అయింది. మత సామరస్యానికి అదే దారి అయింది.

ఆదిలో ఆయన వర్ణ వ్యవస్థను పూర్తిగా సమర్థించాడు. కాని తన సత్యాన్వేషణలో కులచట్రంలోని అంటరానితనం అనే క్రూరత్వం కనిపించింది. ఈ దారుణాన్ని తన మతం అంగీకరించదని హరిజనోద్ధరణకు పూనుకున్నాడు. దేవాలయ ప్రవేశాలను, కులాంతర వివాహాలను సమర్థించాడు.

ఈ అన్వేషణలో భాగంగానే ప్రజాస్వామ్యం అట్టడుగు నుండి పైకి ఎదగాలని స్వయం పోషక గ్రామ రిపబ్లిక్‌లతోనే నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని భావించాడు.

తుపాకులు సైనిక శక్తి గల ఆటవిక శక్తిని ఎదుర్కొనడానికి ప్రతీ మనిషినీ అజేయమైన శక్తివంతుణ్ణి చేసే ఆత్మశక్తినీ, ప్రేమశక్తినీ ప్రతిపాదించి సాయుధుణ్ణి చేసే మార్గాన్ని ఆవిష్కరించాడు.

గాంధీజీ సత్యశోధనకు ఎన్ని పరిమితులు ఉన్నాయని భావించినా నిరంతర సత్యాన్వేషణకు ప్రత్యామ్నాయం లేదు. నిరంతర సత్యాన్వేషణకు సిద్ధం కాని సిద్ధాంతాలు పిడి వాదాలవుతాయి. వ్యక్తులు, సమాజాలు జడవాదంలో పడతాయి. గాంధీ సత్యశోధన అందరికీ మార్గదర్శి. ❑

- ప్రధాన సంపాదకులు ✆ 98660 74023



# ప్రశ్నను చంపేవాడే దేశద్రోహి


మాడభూషి శ్రీధర్
బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్
కేంద్ర సమాచార మాజీ కమిషనర్





విశ్లేషణ

హత్యకన్నా ప్రజాస్వామ్యాన్ని చంపడం. రేప్ కన్నా ప్రజలను భజనపరులుగా మార్చడం, లించింగ్ అనే మూకుమ్మడి హత్యలకన్నా ప్రశ్నించే తత్వాన్ని హత్య చేయడం తీవ్రమైన నేరాలు. పరస్పర ద్వేషాలను రగిలించే విధానాలు అనుసరిస్తూ లించింగ్ సరైనదే అని పరోక్షంగా నేర్పే రాజకీయులు, రాజకీయాలే అసలైన నేరగాళ్లు. రాజకీయ పార్టీలను ప్రశ్నించడం ప్రజాస్వామిక బాధ్యత. కాళోజీ అన్నట్టు అప్పుడే అతను పౌరుడవుతాడు లేకపోతే పోరడు. కానీ అదే అడిగితే? అడిగిన వాడిపై దాడి చేయడం, వేటాడడం, దొంగకేసులు పెట్టడం, పాతకేసులు తవ్వడం, లేదా చెత్తకేసుల్లో ఇరికించడం దారుణాలు. కనిపించని హంతకులు చేసే అదృశ్య హత్యలు ఇవి. న్యాయంగా కేసులు నిర్ధారించిన జడ్జీలను కూడా వేధించడం, విభేదించిన వాడిని బాధించడం, నేర విచారణ అధికారుల మీదే నేరాలు బనాయించడం, కిందిస్థాయి అవినీతి పరులను కలుపుకుని తిరుగుబాట్లు చేయించి, వ్యవస్థలను ధ్వంసం చేయడం, మూకుమ్మడి అత్యాచారాలే.

కాకతీయ యూనివర్సిటీలో ప్రజాకవి పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు ఎండోమెంట్ ప్రసంగం చేయాలని పిలిచారు. కాళోజీ వ్యక్తిత్వానికి సరిపోయే చర్చనీయాంశం ఏదంటే 'ప్రజాస్వామ్యం, ప్రశ్నించే తత్వం' కాక మరేది. 'ప్రజలను చంపే అధికారం ఎవరిచ్చార్రా వెంగళ్రావ్' అంటూ నినదించిన గొంతు ఆయనది. అదీ ఎక్కడ... వెంగళరావు సీఎం హోదాలో సత్తుపల్లిలో అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న చోట. ముఖ్యమంత్రిగా కొనసాగడం కోసం వెంగళ్రావ్ పోటీ చేస్తే, కాళోజీ కేవలం ప్రశ్నించడం కోసం పోటీ చేసినాడు. గెలిచింది సీఎంయే కానీ ప్రజాప్రతినిధి కావలసిన వ్యక్తి కాదు. ఓడింది ప్రజాస్వామ్యమే గాని కాళోజీ కాదు. బూటకపు ఎన్‌కౌంటర్లు జరిపించిన తొలి ఎమర్జెన్సీ సీఎం అని గొంతెత్తి చెప్పడమే విజయం. తిడితే తిట్టనీ, అడిగితే అడగనీ అని జలగం వెంగళరావు అడిగే వాడిని అడగనిచ్చాడు. జవాబు ఇవ్వలేక పోయినా పోటీచేస్తే చేయనీ, అని పోటీ చేయనిచ్చాడు. రాజును రోజూ తిడుతున్నా రాజద్రోహం కేసు పెట్టించలేదు. జలగం ఎంత గొప్పవాడు? కాళోజీ ఇప్పుడు బతికి ఉంటే, అప్పుడెప్పుడో సత్తుపల్లిలో ప్రశ్న వేసినందుకు 2019లో రాజద్రోహం కేసు కింద అరెస్టయి పుణే ఎరవాడ జైల్లో వరవరరావుతోపాటు ఉండేవాడేమో?

కాళోజీ వంటి సెలబ్రిటీ వ్యక్తులు 49 మంది ఈ మధ్య చేసిన నేరం ఏమంటే ప్రశ్నించడం. గుంపు హత్యలు ఈ దేశ పరువును ప్రతిష్ఠను ధ్వంసం చేస్తున్నాయని వారు విమర్శించారు. లించింగ్లు జరగకుండా చూడలేరా అని అడిగితే దేశ ద్రోహం ఏ విధంగా అవుతుందో చెప్పగలరా ఎవరైనా? గత వారం ముజఫ్ఫర్ పూర్ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ సూర్యకాంత్ తివారీ గారికి 49 మంది కళాకారులు మేధావులు ప్రధానికి రాసిన ఈ లేఖలో దేశద్రోహపు రంగులు, కాంతులు, పొగలు, పగలు కనిపించడం ఆశ్చర్యకరం. దేశ ద్రోహం కేసు రిజిస్టర్ చేయాలని ఆదేశించిన ఆ న్యాయాధికారి గారి దృక్పథం ఇదా అని దేశం మ్రాన్పడిపోయింది. మరో 185 మంది సమాజ శ్రేయోభిలాషులు అక్టోబర్ 8న ఆ ఉత్తరాన్ని సమర్థిస్తూ మరో లేఖ వ్రాసారు. వారి మీద కూడా దేశద్రోహం కేసు పెడతారా?

అయితే ఈ అవివేకపు కారు చీకటిలోనూ కొంత వెలుగు కనిపించింది. బీహార్ స్పెషల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ కుమార్ దేశద్రోహపు ఆరోపణ చేసే ఈ ఫిర్యాదును బుట్టదాఖలు చేయాల్సిందే అని నిర్ణయించడంలో వివేకం విజ్ఞత ఇంకా బతికున్నాయనే ఆశాభావం కన్నుతెరిచింది. న్యాయాధికారి చూడలేకుండాపోయిన నిజాలు పోలీసు అధికారికి సులువుగా కనిపించాయి. ఇది దురుద్దేశపూరితంగా చేసిన తప్పుడు ఫిర్యాదు, దేశద్రోహం ఆరోపణ పైన విచారించడానికి అణుమాత్రం ఆధారం కూడా లేదు అని మనోజ్‌కుమార్ వివరించారు. ఈ ఫిర్యాదు చేసిన ఓఝా అనే వ్యక్తి పిటిషన్ పైన జడ్జిగారు జారీ చేసిన ఆదేశం మేరకు కేసు రిజిస్టర్ చేయవలసి వచ్చిందని మరో ఉన్నతాధికారి చెప్పాడు. "ఒరేయ్ ప్రశ్నించేవానికి, ప్రశ్నకు కూడా ద్రోహం చేస్తావ్ రా ఎన్ని గుండెలు నీకు? అయితే నువ్వేరా దేశద్రోహివి, ఇది తెలిసినోడేరా అసలైన దేశభక్తుడు" అని కాళోజీ ఇప్పుడు ఉంటే అనేవాడేమో. ❑



# జాతిపిత – పితామహ !



**మందలపర్తి కిషోర్**

దాదాపు నాలుగు దశాబ్దాల కిందట, వేగుంట మోహన ప్రసాద్ "దిస్ టెన్స్ టైం" అనే కవితా సంకలనం ప్రచురించారు. తెలుగు కవితల ఇంగ్లిష్ అనువాదాలు ఆ సంకలనంలో కూర్చారు వేగుంట. ఆ పుస్తకాన్ని తన తండ్రికీ, "ఆధునిక తెలుగు కవిత్వ పిత" (Father of Modern Telugu Poetry) శ్రీశ్రీకీ ఉమ్మడిగా అంకితం చేశారు సంపాదక మహాశయులు. అదే పెద్ద గొడవకు దారి తీసింది. ఆచార్య రోణంకి అప్పలస్వామి శ్రీశ్రీ ఆధునిక తెలుగు కవితకు Father కాజాలడని పుస్తకావిష్కరణ సభలోనే ప్రకటించారు. ఆ స్థానం గురజాడదేనని కూడా స్పష్టం చేశారు. శ్రీశ్రీతో సహా ఎందరో ఈ వివాదంలో తలదూర్చారు. గురజాడది పితామహ స్థానమని, తనది పితృ స్థానమని శ్రీశ్రీ "సృజనాత్మకమైన" వ్యాఖ్య జోడించారు కూడా. రోణంకిని టెక్కలి పోయి ఇంగ్లిష్ ట్యూషన్లు చెప్పుకోమని ఉచిత సలహా కూడా పారేశారు మహాకవి శ్రీశ్రీ. ఎవరెంత నోరు పారేసుకున్నా, చివరికి ఆచార్య రోణంకి అన్న మాటే నిరూపితమైంది. సంచలనాలూ, వివాదాల గాలివానలకన్నా వాస్తవాలనే వటవృక్షాలు చాలా బలమైనవని దాంతో మరోసారి రుజువైంది.

ఇటీవల ఇంతకు పదింతలు సంచలనాత్మకమూ, వివాదాస్పదము అయిన సునామీ విరుచుకుపడింది. ఈ మధ్యన ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ చరిత్రకు తెలిసినంతలో అత్యంత వివాదాస్పదమైన ప్రకటన ఒకటి చేశారు. ట్రంప్, మోడీని భారత జాతిపితగా అభివర్ణించి, అపారమైన తన చారిత్రిక పరిజ్ఞానాన్నీ దుస్సాహసిక ప్రవృత్తినీ ఏకకాలంలోనే ప్రదర్శించారు. ట్రంప్ ప్రకటనకు ప్రతిస్పందన సైతం దానికి తగినట్లే ఎదురయింది. భారత జాతిపిత స్థానం గాంధీజీదే తప్ప మోడీకీ అమిత్ షాకీ, మోహన్ భాగవత్‌కి ఆ స్థానం కల్పించడం భావ్యం కాదని భారతీయ మేధావి వర్గం, రాజకీయులు, పత్రికా రచయితలూ అభ్యంతరం ప్రకటించారు. అంతకు మించి, భారత జాతిపిత ఎవరో ట్రంప్ నుంచి నేర్చుకునే దౌర్భాగ్యం మనకింకా పట్టలేదని కూడా వాళ్ళు స్పష్టం చేశారు.

దానిమీదట, దేశభక్తిని గుత్తకు పుచ్చుకున్న "కాషాయ దళం", అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ తరపున బరిలోకి దిగిపోయింది. గాంధీజీని జాతి పితామహుడనీ, మోడీని జాతిపిత అనీ అంటే తప్పేముందని కాషాయదళం ప్రశ్నించింది కూడా! సంతోషం– మోడీయే భారత జాతి పిత, అతగాడే జాతిపితామహుడు కూడానని ట్రంపూ, కాషాయ దళమూ బరితెగించి శాసిస్తే నోరులేని భారతజాతి చేయగలిగేది ఏముంటుంది?

అయినప్పటికీ పాపం గాంధీజీ మునిమనవడు తుషార్ గాంధీ, మౌనం పాటించలేక, ట్రంప్ వ్యాఖ్యలకు తీవ్ర అభ్యంతరం ప్రకటించారు. అంతేకాదు– సర్కారు "ఘనంగా" జరిపించదల్చిన గాంధీజీ 150వ జయంతిని వాస్తవానికి "కేవల లాంఛనంగా మాత్రమే" పాటిస్తున్నారని కూడా తుషార్ గాంధీ వ్యాఖ్యానించడం గమనార్హం. గాంధీజీని నిలువునా హత్యచేసిన నత్తూరాం గోడ్సేని ఘనంగా కీర్తించేందుకు సంఘపరివారం చేస్తున్న ప్రయత్నాల్లోని సంభావ్యతను గురించి కొందరు పాత్రికేయులు తుషార్ గాంధీని ప్రశ్నించారు. "ఈ విషయంలో ఏది మంచిదో, ఏది కాదో చరిత్ర నిర్ణయిస్తుంది" అని మాత్రమే అన్నారు తుషార్ గాంధీ. "విద్వేషాన్నీ, హింసనూ ఆరాధించేవాళ్ళు కావాలనుకుంటే గోడ్సేని పూజించవచ్చు. నేను వారిని వ్యతిరేకించను" అని మాత్రమే అన్నారాయన. అక్కడితో ఆగక "ఇవాళ భారత జాతిపిత స్థానంలో మోడీని కూర్చోపెడుతున్న ట్రంప్, రేపు జార్జ్ వాషింగ్టన్ స్థానంలో తాను చతికిలబడినా వింత లేదు" అని కూడా అన్నారు తుషార్ గాంధీ. గాంధీజీ మునిమనవడు తన ముత్తాత చూపిన బాటలోనే స్పందించడం గమనార్హం.

కానీ, కొందరు కాంగ్రెస్ నేతలు మాత్రం ట్రంప్ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. వారిలో ముందుగా చెప్పవలసింది కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య వ్యాఖ్యల గురించి. "మోడీ నిజమైన దేశభక్తుడే అయితే అక్కడే, ట్రంప్ సమక్షంలోనే, ఆ దుర్వ్యాఖ్యానాన్ని ఖండించి ఉండాల్సిన"దని సిద్దరామయ్య అన్నారు. అంతేకాదు– అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను "అజ్ఞాని"గా

☞ మిగతా 8వ పేజీలో

**అసత్యంతో సాధించిన విజయం కంటే సత్యంతో పొందిన పరాజయమే గొప్పది.**

# గాంధీ – గో సంరక్షణ

- కొప్పర్తి వెంకటరమణమూర్తి



వర్తమాన భారతదేశంలో ముస్లింల మీద, దళితుల మీద వారి ఆహారపు అలవాట్ల కారణంగా జరుగుతున్న దాడులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మరీ ముఖ్యంగా గొడ్డు మాంసం తినడం గురించి. గొడ్డు మాంసం తినడం అలవాటుగా గల ముస్లింల మీద దళితుల మీద జరుగుతున్న దాడులు సాంస్కృతిక జాతీయవాద అసలు రూపాన్ని బట్టబయలు చేస్తున్నాయి. "హిందూమతానికి స్వయం ప్రకటిత రక్షకులుగా ఉన్న వారి వాదనలు వేరుగా ఉంటాయి. బయట నుంచి వచ్చి ఈ దేశంలో పరాయివారిగా ఉన్న ఇస్లాం అనుయాయుల ద్వారానే మొట్టమొదటగా గోమాంస భక్షణ ప్రవేశించిందని వీరు చెప్తారు. అయితే రకరకాలయిన జంతువులతో పాటే ఆవు మాంసాన్ని కూడా భక్షించిన తమ వైదిక పూర్వీకులు కూడా బయట నుంచే వచ్చారన్న సంగతిని వారంతగా పట్టించుకోరు". *1

మానవుడు వ్యవసాయం నేర్చుకొని నాగరికుడుగా మారడానికి ముందు పశుపాలకుడుగా ఉన్నాడని, పశుపాలకునిగా రూపొందడానికి ముందూ వెనుక పశు మాంసభక్షణ అతని ప్రధాన ఆహారంగా ఉందనీ, చరిత్ర పూర్వయుగ మానవ సమాజాల్లో పశుమాంస భక్షణ అనివార్యంగా ఉందనీ, నాగరిక సమాజాలేవీ ఆ దశ నుంచి మినహాయింపు పొందలేదని అందరికీ తెలుసు. భూమ్మీద కొన్ని జంతువులు శాకాహారులైనప్పటికీ మానవుడు మరికొన్ని జంతువులతో పాటు ప్రాయికంగా మాంసాహారి. భారతదేశంలోకి ప్రవేశించిన ఇండో యూరోపియన్ జాతులు దేశంలో ప్రవేశించినప్పుడు తమ సంచారకజాతి సంప్రదాయాలతో పాటు జంతువులని కూడా తీసుకు వచ్చారు. "ఇస్తే వస్తుంది" అనేది బలికి మానవుణ్ణి ప్రేరేపించిన మొదటి సూత్రం. దేవతకి ఒక జంతువును సమర్పిస్తే అధికసంఖ్యలో దేవత వాటిని తిరిగి ఇస్తుందనీ ఫలితంగా తమ సంపద పెరుగుతుందనీ విశ్వసించడమే ఇందుకు కారణం. అంటే బలి ఇవ్వడం అంటే దేవతకి తమకు ఏం కావాలో చెప్పడమే.

యదన్నం మనుష్యోపతి / తదన్నం తస్యదేవతా అంటుంది రుగ్వేదం. ఏ అన్నమైతే మనిషి తింటాడో ఆ అన్నాన్నే దేవతలకు పెట్టాడు అని అర్థం. దీన్ని జాగ్రత్తగా గమనిస్తే ఇది ఏ అన్నాన్నైతే దేవతలకు పెడతాడో ఆ అన్నాన్నే తాను తింటున్నాడు అని అర్థం కాదని తెలుస్తుంది. వేదాలు, శ్రుతులు, స్మృతులు, పురాణాలు భారతదేశపు తొలి జాతులు. విస్తారంగా గోమాంస భక్షణ చేసాయని చరిత్రకారులు, పండితులు వేలాది ఉదాహరణలు, ఉటంకింపులు చేసి చూపిన తర్వాత కూడా "యే కాలంలో అయితే యజ్ఞంలో గోవును బలి ఇస్తూ దాని మాంసాన్ని భక్షించారో, సరిగ్గా ఆ కాలంలోనే గోవు పవిత్రమైందన్న భావన యొక్క జాడలను తవ్వి తీయడానికి భారతీయ సమాజంలోని కొన్ని తరగతులకు చెందినవారు నడుం బిగించారు". *2

బలిపశువు మానవ వినియోగానికేనన్న విషయాన్ని తైత్తరీయ సంహిత, గోపథ బ్రాహ్మణం స్పష్టం చేస్తున్నాయనీ, శతపథ బ్రాహ్మణంతో సహా ఇతర వైదిక వాఙ్మయం మాంసాన్ని అత్యుత్తమ ఆహారంగా ప్రకటించాయనీ, ఇంటికి అతిథి వస్తే గోమాంసం పెట్టడం గౌరవసూచకమని, ఇంద్రుడికి ఎద్దు మాంసం ప్రీతిపాత్రమైనదనీ, యాజ్ఞవల్క్యుడు లేత గోమాంసాన్ని ఇష్టపడేవాడని, మనువు సైతం తినకూడని మాంసాలలో ఆవును చేర్చలేదనీ, రామాయణ మహాభారతాల్లో రాముడు, సీత, పాండవులతో పాటు బ్రాహ్మణులు మాంసభక్షణ చేసిన సందర్భాలు కొల్లలుగా ఉన్నాయని, చరకుడు, శుశ్రుతుడు, వాగ్భటుడు రాసిన వైద్యశాస్త్ర గ్రంథాల్లో చికిత్సకోసం మాంసాహారాన్ని ఉపయోగించిన ఏ సందర్భంలోనూ ఆవు మాంసం పవిత్రమైనదని గానీ, నిషేధితమని కానీ ప్రకటించలేదనీ పేర్కొంటున్నాడు డి.ఎన్.ఝా. తన "The Myth of the Holy Cow" గ్రంథంలో.

కాగా మధ్యయుగాల ప్రారంభం నుంచి గోవధ పట్ల వ్యతిరేకత గోచరమౌతుంది. అక్కణ్ణుంచి మత గ్రంథాలు పశువధను నిరసించసాగాయి. క్రమంగా గోవు పవిత్ర స్థానాన్ని సాధించుకుని కనీసం బ్రాహ్మణుల ఆహారం నుంచి మినహాయించబడింది. ఆల్‌బెరూనీ (1017–30) సైతం పూర్వ కాలంలో బ్రాహ్మణులు ఆవు మాంసం తినే వారనే అంశాన్ని ప్రస్తావిస్తూ అది తొలగిపోవడానికి వినవచ్చిన కారణాలు తనకు

**ఏ పనీ చేయని వ్యక్తికి తిండి తినే హక్కు ఉండదు.**

సంతృప్తి కలిగించలేదంటాడు. గోవు పవిత్రంగా మారుతూ గోమాంస భక్షణ బ్రాహ్మణులకు నిషిద్ధం అవుతూ వచ్చిన సందర్భంలోనే ఆవు వర్జితాలు అశుచిని పోగొట్టే డిటర్జెంట్లు అయ్యాయి. గోమయంతో అలకడం వల్ల, గోమూత్రం చిలకరించడం వల్ల అనేక రకాల భౌతిక మానసిక అశుద్ధాలు తొలగించబడతాయనే నమ్మకం ప్రబలింది. అశుద్ధంతో అశుద్ధం శుద్ధమౌతుందనుకోవడం మౌఢ్యానికి పరాకాష్ఠ.

కాగా, ప్రాచీన కాలంలో ప్రధాన భోజ్యంగా, బలిపశువుగా, ఆర్థిక వనరుగా ఉన్న గోవు మధ్యయుగాల నాటికి అత్యంత పవిత్రమైనదిగ అవతారమెత్తడానికీ, బ్రాహ్మణుల విస్తళ్ళ నుంచి గోమాంస ఖండాలు అదృశ్యమైపోవడానికీ కారణాల్ని అన్వేషించిన బి.ఆర్.అంబేద్కర్ భారతదేశంలో ఆహార అలవాట్లు మొదట మనుషుల్ని శాకాహారులుగా, మాంసాహారులుగానూ, మాంసాహారుల్ని మళ్ళీ గొడ్డుమాంసం తినేవారిగా, తిననివారు గానూ విభజించగా, శాకాహారులూ, గొడ్డు మాంసం తినని మాంసాహారులు కలిసి గొడ్డు మాంసం తినేవారిని అస్పృశ్యుల్ని చేశారనీ అంటూ, బలుల్ని, యజ్ఞాల్ని వ్యతిరేకించిన బౌద్ధం పుంజుకోవడంతో వెనుకడుగు పట్టిన బ్రాహ్మణ మతం మధ్య యుగాల ప్రారంభంలో పునరుజ్జీవన పథం పట్టి బౌద్ధాన్ని అనుకరించిన, బౌద్ధం మాదిరిగానే దేవాలయాల నిర్మాణాన్ని, విగ్రహారాధనను ఒంట పట్టించుకుంటూ బుద్ధునికి ప్రతిద్వంద్విగా విష్ణువుని ముందుకు తెచ్చిందనీ ఈ సందర్భంలోనే హింసను వ్యతిరేకిస్తూ పవిత్ర జీవితం గడుపుతున్న బౌద్ధ భిక్షువుల్ని బ్రాహ్మణులు అనుసరించక తప్పలేదనీ, వారు గోవధను విడిచి పుచ్చక తప్పలేదనీ అంటాడు.

"జంతుబలి మంచిది కాదని బ్రాహ్మణులు విశ్వసించి నట్లయితే యజ్ఞాల పేరిట జంతుబలులు ఇవ్వడం మానుకుంటే సరిపోయేది. ఇందుకు వారు శాకాహారులు కానవసరం లేదు. వారు శాకాహారులయేందుకు నిర్ణయించుకున్నారంటే వారు దూరాలోచన చేశారన్నది స్పష్టం. ఇక, వారు శాకాహారులు నిజానికి కానవసరం లేదు. బౌద్ధ భిక్షువులు శాకాహారులు కాదు. ఐతే అనేక మందికి ఈ మాట ఆశ్చర్యం కలిగించవచ్చు. సాధారణంగా అహింస, బౌద్ధమతం విడదీయరానివని భావిస్తుంటారు. బౌద్ధ భిక్షువులు మాంసాహారాన్ని నిరసిస్తారనీ భావిస్తుంటారు. సాధారణంగా ఇది పొరపాటు. వాస్తవానికి బౌద్ధ భిక్షువులు పవిత్రమైనవని పేర్కొన్న మూడు రకాల మాంసాన్ని తినవచ్చు. ఆ తరువాత ఐదు రకాల మాంసాలను తినవచ్చని నిబంధనను విస్తృతం చేసుకున్నారు.

"...బౌద్ధుల కంటే మెరుగనిపించుకునేందుకు వారు గోమాంస భక్షణ విడిచిపెట్టడమే కాదు, శాకాహారులుగా కూడా కావలసి వచ్చింది. అదే చేశారు కూడా..." *3

భారతదేశంలో గోచరిత్రకు సంక్షిప్త రూపం ఇది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మాంసాహారం కంటే శాకాహారం ఉత్కృష్టమైనదనే భావన భారతదేశంలో పొడ చూపటానికి కారణం అగ్రవర్ణమైన బ్రాహ్మణులు శాకాహారులు కావడమే. ప్రాణికోటిలో కొన్ని శాకాహారులు కొన్ని మాంసాహారులు కావడం ప్రాకృతికం. మానవుడు ప్రాథమికంగా మాంసాహారి. బహుశ మానవుని తొలి ఆహారం పాల తర్వాత మాంసాహారమే అయి వుంటుంది. సంస్కృతిలో వచ్చిన మార్పుల ఫలితంగా ఒకనాటి బలిపశువు దేవతగా, మాతృ సమానురాలిగా పరిణామం చెందకూడదనీ పూజలందుకోరాదనీ కాదు. బహుళతత్వం కలిగిన సమాజంలో అందరూ దాన్నే పాటించాలనడం దుర్మార్గం అవుతుంది. కోళ్ళనీ మేకల్నీ తినే వాళ్ళు గొడ్లని తినేవాళ్లని అనాగరికులనడం ఏ సాపేక్ష సిద్ధాంతం కిందికి వస్తుంది? జాతిపరంగా వేల ఏళ్ళుగా అనుసరిస్తూ వస్తున్న ఆహారపు అలవాటును ఎవరి కోసమో దేని పవిత్రతని కాపాడడం కోసమో ఎవరు వదులుకుంటారు? ఒకప్పుడు బ్రాహ్మణుడు ఆవుని చంపి తింటే అంటరానివాడు చచ్చిన ఆవును తిన్నాడు. 'అగ్రజుడు' ఆవుని చంపడం మానివేసాడని, 'అంత్యజుడు' చచ్చిన ఆవును లేదా చంపిన ఆవును తినడం ఎట్లా మానతాడు? ఆహారంలో ఏది వర్జనీయమో ఏది కాదో ఎవరు నిర్ణయిస్తారు? మాంసం నిషిద్ధమైతే నిండా మాంసకృత్తులు కలిగి బతికి ఉన్న గోవు తన మాంసం నుంచి తయారుచేసి ఇచ్చిన క్షీరం వర్జనీయమెందుకు కాదు? కోడె దూడ కోసం తయారయ్యే పాలను దానికి దక్కనివ్వకుండా మభ్యపెట్టి దాన్ని అర్థాకలికి మిగిల్చి పిదుగుకునే పాలు ఏపాటి న్యాయ సమ్మతమైనవి? మానవుడు బలవంతంగా రూపొందించుకున్న ఆహారపు అలవాట్లు ప్రకృతి ఇచ్చిన అలవాట్ల కన్నా గొప్పవి ఎట్లా అవుతాయి? ఆవు మాంసం కన్నా దాని మలమూత్రాలు పవిత్రం కావడం ఏ నాగరికతకు చిహ్నం? బతికున్న ఆవును దక్కించుకుని, అది చచ్చిన తరువాత ఆ అంటరానిదాన్ని ఒకడికిచ్చి వాణ్ణి అంటరానివాణ్ణి చేసి, దాన్ని తీసుకెళ్ళి చర్మం వొలిచి కుళ్ళిపోయి దుర్గంధం రాకుండా దాని మాంసం తిని కడుపు నింపుకునేటట్టు చేసి, ఇప్పుడు తినడానికి వీల్లేదంటే తినేదెట్లా? బతికేదెట్లా? పాలు, పెరుగు, నెయ్యి అతనికి దక్కనివ్వకుండా చేసినందువల్లే కదా 'మజ్జిగ లేని కూడు మాలకూడు' అయ్యింది. మాంసం ఎవరూ తినడానికి వీల్లేదనే మహత్తర ఉదాత్త ఆశయం ఉండి ఉంటే పాలల్లో వాటా ఇచ్చినట్లయితే అతను కూడా ఇంత మజ్జిగన్నం తిని మాంసాన్ని విడిచిపెట్టేవాడేమో కదా !

గో రక్షణ సమస్య గురించి గాంధీ ఆలోచనలు సార్వజనికంగా, సార్వకాలికంగా ఉన్నాయి. గోసంరక్షణ హిందూ హృదయానికి అత్యంత ప్రీతిపాత్రమైన అంశంగా ఉండాలని, గో సంరక్షణ మీద నమ్మకం లేని వ్యక్తి హిందువు కాలేదని, గోవును సంరక్షించడమంటే సాత్వికతని, నిస్సహాయతనీ కాపాడుకోవడమని అంటూ గోసంరక్షణ మనిషికి పశువు మధ్య నెలకొనాల్సిన భాతృత్వానికి నిదర్శనమన్న, ఆచార్య వస్వాణి అభిప్రాయంతో ఏకీభవించిన గాంధీ ఈ పవిత్ర ఆశయ సాధనకోసం దీర్ఘకాలం కఠోర సహనాన్ని పాటిస్తూ తపస్సు చేయాలని రాశాడు, 1921 జూన్ 8 నాటి యంగ్ ఇండియాలో.

మళ్ళీ 1925 జనవరి యంగ్ ఇండియాలో రాస్తూ... ముసల్మాన్ తమ మతం ఆవును చంపడాన్ని అనుమతిస్తుందంటున్నప్పుడు అతని చేత బలవంతంగా దాన్ని నివారించడం అతన్ని బలవంతంగా హిందూ మతంలోకి మార్చడమే అవుతుందని అభిప్రాయపడిన గాంధీ స్వతంత్ర భారతదేశంలో హిందువులు తమ మెజారిటీ బలంతో బలవంతంగా గోరక్షణ చట్టాలు చేయబూనడం వివేకవంతమూ, విధాయకమూ కాదని నిర్ద్వంద్వంగా ప్రకటించాడు.

" How can I force any one not to slaughter cow, unless he is himself disposed. It is not as if there were only Hindus in Indian Union. There are Muslims, Parsis, Christians and other religious groups here. **<u>The assumption of the Hindus that India now has become the land of Hindus is erroneous.</u>** *4 (emphasis added) ❑

**డా॥ గరికపాటి రుద్రయ్య చౌదరి స్మారకోపన్యాసం నుంచి రామచంద్రపురం, తూర్పుగోదావరి జిల్లా - 26-2-2018**

---

*1 డి.ఎన్.ఝా : గోవు పవిత్రత - ఓ కట్టుకథ, పే. 19 - ప్రజాశక్తి పబ్లిషింగ్ హౌస్, డిసెంబర్, 2016

*2 డి.ఎన్.ఝా : పే. 17

*3 బి.ఆర్.అంబేద్కర్ : అస్పృశ్యులు : వారెవరు ? ఎందుకలా అయ్యారు ? బాబా సాహెబ్ అంబేద్కర్ రచనలు - ప్రసంగాలు - సంపుటం 7 ముద్రణ 1992 పే. 324

*4 Collected works of Mahatma Gandhi : Published online by Gandhi Heritage Portal, Vol. 88, Page 424

---

## జాతిపిత - పితామహ !

**(5వ పేజీ తరువాయి)**

అభివర్ణించారాయన. అక్కడితో ఆగక, ట్రంప్‌కు, మోడీకీ తేడా లేదని కూడా వ్యాఖ్యానించడం గమనార్హం. భారత జాతిపిత ఎవరో ట్రంప్ కనీసం బరాక్ ఒబామాను అడిగి ఉండాల్సిందని కూడా సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు.

వాస్తవానికి ట్రంప్ చేసిన వ్యాఖ్య కేవలం చరిత్ర (అ) జ్ఞానానికి పరిమితమైన విషయం కాదు. అది మౌలికంగా నైతిక విషయం.

భారతీయుల మనసులలో జాతీయ భావన పాదుకొల్పిన వాడు గాంధీజీ. లాల్, బాల్, పాల్ లు మొదలుపెట్టిన జాతి నిర్మాణాన్ని మేలిమలుపు తిప్పిన వాడు గాంధీజీ.

"జడలు విచ్చిన, సుడులు రెచ్చిన" మతోన్మాదం జాతిని నమిలి మింగేయకుండా అహర్నిశలూ పాటుపడినవాడు గాంధీజీ.

చివరికి, జాతి సంక్షేమంకోసం ప్రాణాలను సైతం బలిపెట్టిన త్యాగశీలి గాంధీజీ. మార్టిన్ లూథర్ కింగ్ (జూ), నెల్సన్ మండేలా, ఒకదశలో చేగెవారా తదితరులను ప్రభావితం చేసిన మూర్తిమత్వం గాంధీజీది. అందుకే ఆయన్ను రబీంద్రనాథ్ టాగోర్ "మహాత్ముడి"గా భావించి సంభావించాడు.

ఆనాటి కమ్యూనిస్ట్ పార్టీ ప్రధానకార్యదర్శి పూరన్ చంద్ (పీసీ) జోషీ, గాంధీజీని జాతిపితగా పిలిచిన మొదటి వ్యక్తి. అటువంటి మహాత్ముడి స్థానంలో, మోడీని ప్రతిష్ఠించాలన్న ట్రంప్ ప్రయత్నం అతగాడి సంస్కారానికి మచ్చుతునక!

విదేశీ గడ్డమీద, స్వదేశీయుల సమక్షంలో, ఎన్నికల సభలో మాట్లాడిన రీతిలో ప్రసంగించిన ఓ సామాన్య నాయకుణ్ణి, జాతిపిత స్థానంలో ప్రతిష్ఠించాలనుకోవడం నైతిక సమస్య కాక మరేమిటి?

పదుల వేల మంది స్వదేశీయుల సమక్షంలో తెలిసీ తెలియని ఒకానొక పరదేశి జాతిపితను అవమానిస్తుంటే ప్రసన్నవదనంతో చూస్తుండడం కచ్చితంగా నైతిక సమస్యే!

చట్టపరంగా అది నేరం కాకపోవచ్చు- నైతికంగా మాత్రం అది ఘోరమే! చట్టపరమైన లొసుగులు ఉపయోగించుకుని వందల కోట్లు సంపాదించానని నిర్భయంగా చెప్పిన ట్రంప్ ఏమాటైనా అనగలడు. బజారు మనుషులు మాట్లాడ్డానికి కూడా సిగ్గుపడే బూతులు సైతం పలకగలడు.

కానీ, అలాంటి వ్యక్తి జాతి పితను అవమానిస్తుంటే చూసి ఊరుకున్న ప్రధాన మంత్రి మోడీని గురించి ఏమనుకోవాలి??

ఇదీ మనముందున్న అసలైన నైతిక సమస్య! ❑

# మహాత్మాగాంధీ మతం ఏమిటి ? గాంధీ దృష్టిలో దేవుడు ఎవరు ?

**కుమార్ ప్రశాంత్,** గాంధేయవాది

ప్రజల మనసులో చెరగని ముద్ర వేసిన, సమాజం మొత్తానికీ ప్రాతినిధ్యం వహించిన మహాత్మా గాంధీని ఓ వర్గానికి ప్రతినిధిగా చూపించేందుకు నేడు చాలా ప్రయత్నాలే జరుగుతున్నాయి. ఆనాడు కూడా ఇలాంటి ప్రయత్నాలకు తక్కువేమీ లేదు.

తూర్పు, పడమరలా ఉండేవారంతా ఈ విషయంపై మాత్రం ఏకతాటిపైకి వస్తారు.

ఇటు సనాతన హిందువులు, అటు కరడుగట్టిన ముస్లింలు తమ మతాలకు సంబంధించిన విషయాల్లో గాంధీ జోక్యం అవసరం లేదని ఆనాడు తెగేసి చెప్పారు.

తమ గురించి మాట్లాడే హక్కు దళితుడుకాని గాంధీకి ఎలా ఉంటుందని దళితులు భావించేవారు. మతమార్పిడి విషయంలో ఆయన్ను క్రైస్తవులు బహిరంగంగానే తప్పుపట్టేవారు.

ఈ అంశంలో గాంధీపై చివరి అస్త్రాన్ని బాబా సాహెబ్ అంబేద్కర్ సంధించారు. మీరు భంగీ (అంటరాని వారిలో అతితక్కువ కులం) కానప్పుడు మా గురించి ఎలా మాట్లాడతారని గాంధీని ఆయన ప్రశ్నించారు.

దీనిపై గాంధీ స్పందిస్తూ.. "ఈ అంశంపై నాకు ఎలాంటి హక్కూ లేదు. కానీ భంగీల గురించి మాట్లాడేందుకు భంగీగానే పుట్టాలన్నదే తప్పనిసరైతే.. వచ్చే జన్మలో భంగీ ఇంట్లో పుట్టాలని కోరుకుంటాను" అని సమాధానం ఇచ్చారు.

అంతకు ముందు కూడా గాంధీ చేసిన ఓ వ్యాఖ్యకు అంబేద్కర్ మౌనమే సమాధానమైంది. "నేనూ అంటరాని వాణ్నే. అందరినీ ఏకతాటిపై కలుపుకుంటూ వెళ్లడమే నా లక్ష్యం" అని నాడు గాంధీ చెప్పడంతో అంబేద్కర్ నోట మాట రాలేదు.

"నేను అత్యంత నిబద్ధత, నిజాయితీగల అంటరాని వాణ్ని. ఎందుకంటే మిమ్మల్ని సమాజం అంటరానివారిగా పరిగణిస్తోంది. నా విషయానికి వస్తే.. అంటరానివాడిగా బతకాలని నాకు నేనుగా నిర్ణయించుకున్నాను" అని ఆనాడు గాంధీ చెప్పారు.

రామరాజ్యాన్ని తీసుకురావాలని తాను భావిస్తున్నట్లు గాంధీ చెప్పినప్పుడు హిందూత్వ నాయకులు మీసాలు మెలేశారు. ఓ మెట్టు దిగివచ్చి మరీ ఆనాడు వారు గాంధీని సమర్థించారు.

అయితే ఓ విషయం గుర్తుపెట్టుకోవాలి. ఇక్కడ రామ్ అంటే దశరథుడి తనయుడు కాదని గాంధీజీ ఆనాడే స్పష్టం చేశారు.

ఆదర్శ పాలనంటే రామరాజ్యమని ప్రజల్లో ఓ భావన ఉందని, అలాంటి రాజ్యాన్నే తాను రావాలని కోరుకుంటున్నట్లు గాంధీజీ చెప్పారు.

ప్రజల మనసులో బలంగా నాటుకుపోయిన విషయాలకు ప్రతి విప్లవకారుడు కొత్త భాష్యం చెప్పేందుకు ప్రయత్నిస్తాడు. ఆ కొత్త భాష్యం ఈ సమాజానికి సరిపడేలా చూసేందుకు ప్రయత్నిస్తాడు.

తనను తాను సనాతన హిందువునని గాంధీ చెప్పుకొన్నా.. ఓ హిందువుకు ఉండాల్సిన లక్షణాలను ఆయన స్పష్టంగా వెల్లడించారు. కరడుగట్టిన వారెవరూ తన వెనుక రావొద్దని ఆయన స్పష్టీకరించారు.

ఎవరు నిజమైన హిందువు? ఈ ప్రశ్నకు నరసింహ మెహతా కీర్తనలను గాంధీ ఉదహరిస్తుంటారు.

"విష్ణు జనులు (హిందువులు) ఎవరంటే.. ఎవరైతే పరుల బాధలను దూరం చేస్తారో వారే. కష్టాల్లో ఉన్నవారికి సాయం చేసినా వీళ్లు మానాభిమానాలను (గర్వాన్ని) దరిచేరనీయరు."

ఇక గాంధీ వద్దకు వచ్చే హిందుత్వ వాదులు ఎవరున్నారు?

మరోవైపు వేదాలను అనుసరించే పండితులు సైతం గాంధీజీపై విరుచుకుపడేవారు. "మీరు హిందువునని చెప్పుకొంటే.. వేదాల్లో చెప్పినవి అనుసరించాల్సిందే. కుల వ్యవస్థకు వేదాలు మద్దతు పలుకుతున్నాయి" అని వారు చెప్పేవారు.

వారికి గాంధీజీ నిర్మొహమాటంగా సమాధానాలు ఇచ్చేవారు. "నా వేదాధ్యయనం ప్రకారం.. కుల వ్యవస్థకు వేదాలు మద్దతు పలికినట్టు అనిపించడంలేదు. ఒకవేళ ఎవరైనా కుల

**మేధావులు మాట్లాడతారు - మూర్ఖులు వాదులాడతారు.**

వ్యవస్థకు వేదాలు మద్దతు పలికినట్టు నిరూపిస్తే.. ఆ వేదాలను నేను అనుసరించను" అని గాంధీ స్పష్టంచేశారు.

హిందు, ముస్లింల మధ్య పెరిగిన రాజకీయ అగాధాన్ని పూడ్చడమే లక్ష్యంగా మొదలుపెట్టిన జిన్నా, గాంధీ ముంబయి చర్చలు ఓ చోట ఆగిపోయాయి. "నేను ముస్లింల ప్రతినిధిగా మీతో చర్చలు జరిపేందుకు వచ్చాను. మీరు కూడా హిందువుల ప్రతినిధిగా మాట్లాడండి. మనం సమస్యను పరిష్కరిద్దాం" అని గాంధీతో జిన్నా అన్నారు. "అయితే అటు హిందువులు, ఇటు ముస్లింల ప్రతినిధిగా మీరు చర్చలు జరుపుతానని అంటున్నారు. దీనికి నేను అంగీకరించను" అని జిన్నా ఆనాడు చెప్పారు.

"ఏదో ఒక వర్గం లేదా ప్రత్యేక కులానికి ప్రతినిధిగా చర్చలు జరపడానికి నా మనసు అంగీకరించదు. అలాంటి చర్చలు నేను జరపలేను" అని ఆనాడు గాంధీ తెగేసి చెప్పారు. అక్కడి నుంచి వచ్చేసిన గాంధీ ఇక జిన్నాతో మాట్లాడనేలేదు.

కొందరు తమ రాజకీయ లక్ష్యాలకు అనుగుణంగా పుణె ఒప్పందానికి నీళ్లు వదిలేశారు. అప్పుడు దేశ వ్యాప్తంగా హరిజన్ యాత్ర పేరుతో యాత్ర మొదలుపెట్టింది గాంధీజీనే. అంత వయసులోనూ ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. "ఆ ఒప్పందానికి కట్టుబడి ఉన్నట్లు భావిస్తున్నాను. ఎలా ప్రశాంతంగా కూర్చోగలను" అని ఆనాడు గాంధీ చెప్పారు.

కుల వ్యవస్థ, అంటరానితనం రూపుమాపాలని కోరుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన ర్యాలీనే హరిజన్ యాత్ర.

ఇది "వన్ మ్యాన్ ఆర్మీ"నే కానీ.. అన్ని యుద్ధాల్లోనూ ఇది గట్టి పోరాటం చేస్తుందని గుర్తించేందుకు లార్డ్ మౌంట్ బ్యాటన్ గుర్తించేందుకు చాలా సమయమే పట్టింది.

హరిజన్ యాత్ర లాంటి భారీ యాత్ర అనంతరం రోజు రోజుకూ పెరుగుతున్న గాంధీ ప్రభావాన్ని గుర్తించి చాలా అతివాద హిందూత్వ సంస్థలు కిమ్మనకుండా ఉండిపోయాయి.

గాంధీజీ దక్షిణ భారత్ యాత్రలో అందరూ ఆయన వెనకే వచ్చారు. దేవాలయాల్లోకి హరిజనుల ప్రవేశంపై నేరుగానే ప్రశ్నలు సంధించారు. ఇలాంటి చర్యలతో హిందుత్వం భావన ధ్వంసమవుతుందని వాదించారు.

"నేను చేస్తున్న పనులతో హిందూత్వం దెబ్బతిన్నా పట్టించుకోను. నేను ఇక్కడికి వచ్చింది హిందూత్వాన్ని కాపాడేందుకు కాదు. నేను ఈ ధర్మాన్ని సంస్కరించాలని అనుకుంటున్నా" అని అక్కడకు వచ్చిన లక్షలాది మందికి గాంధీ చెప్పారు. అనంతరం హరిజనుల కోసం ఎన్నో దేవాలయాలు తెరచుకున్నాయి. ఎన్నో దురాచారాలు, సంకుచిత విధానాలు, భావనలు కనుమరుగు అయ్యాయి.

బుద్ధుడి తర్వాత సామాజిక-మత దురాచారాలపై ఎవరైనా గట్టి, లోతైన ప్రభావం చూపారా అంటే.. వెంటనే గాంధీజీ పేరే చెప్పాలి. ఇలాంటి సామాజిక భూతాలను తరిమే క్రమంలో గాంధీ ఓ కొత్త మత వర్గాన్నీ సృష్టించలేదు. ఎలాంటి కొత్త అభిప్రాయాలనూ లేవనెత్తలేదు. భారత స్వాతంత్ర్య ఉద్యమం బలహీనపడకుండా ఆయన దీన్ని ముందుకు తీసుకెళ్లారు.

సత్యమే గాంధీ మతం

"సత్య నిష్ఠ" విషయంలోనూ ప్రపంచంలో ఏ రాజకీయ తత్వవేత్త లేదా ఆధ్యాత్మిక గురువు, లేదా మత నాయకుడు ఇవ్వలేని తార్కాణాన్ని గాంధీజీ ప్రపంచం ముందుంచారు.

గాంధీ పాటించిన ఈ ధర్మం.. ప్రపంచంలోని ఏళ్ల నాటి ఆచారాలను అనుసరిస్తున్న మతాల గోడలను బద్దలుకొట్టింది. అన్ని మత, ఆధ్యాత్మిక విశ్వాసాలనూ కుదిపింది.

మొదట "దేవుడు.. అంటే సత్యం" అని గాంధీ చెప్పారు.

"ఎవరికి వారు సొంత దేవుణ్ని సృష్టించుకోవడంతో గందరగోళం ఏర్పడింది. మనుషుల్ని చంపడం, అగౌరవ పరచడం, ఆత్మన్యూనత భావానికి గురిచేయడం లాంటివి దేవుడి పేరుతో చేస్తున్నారు" అనే గాంధీజీ భావించారు.

దీంతో గాంధీజీ సత్యంపై ఓ కొత్త వాదనను తెరమీదకు తీసుకొచ్చారు. "దేవుడే సత్యం' అన్నది సరికాదు.. "సత్యమే దేవుడు" అని చెప్పారు.

"మతం లేదా గ్రంథం లేదా విశ్వాసాలు, సంప్రదాయాలు లేదా స్వామి, గురు, మహంత్, మహాత్మ ఇవేమీ దేవుడు కాదు.. కేవలం సత్యం మాత్రమే.. కేవలం సత్యం" అని ఆయన అన్నారు.

సత్యాన్వేషణ, సత్యాన్ని గుర్తించడం, సత్యాన్ని ప్రజల ముందుకు తీసుకు వచ్చేందుకు కృషి చేయడం.. ఇవే గాంధీ మతం.. ఇవే ప్రపంచ మతం.. ఇవే మానవత్వ మతం.. ఇలాంటి గాంధీజీ నేటి ప్రపంచానికి అత్యంత అవసరం.

*బిబిసి న్యూస్ సౌజన్యంతో...* ❑

**అన్ని మతాల సారం ఒక్కటే... చేరుకునే మార్గాలే వేరు.**

# గాంధీ రచనలలో గ్రామ స్వరాజ్యము

## గ్రామాల స్థానము

గ్రామాలను సేవించడమే స్వరాజ్య స్థాపనము. తక్కినదంతా వట్టి కల. - యంగిండియా 26-12-29

గ్రామాలు నశిస్తే భారతదేశం కూడా నశిస్తుంది. అప్పుడది భారతదేశమే కాదు. ప్రపంచంలో దాని ధర్మసందేశం వినబడకుండా పోతుంది. -హరిజన్ 29-8-36

భారతదేశమంతటి ప్రాచీనత గలిగినట్టి అతి పురాతనమైన గ్రామాలు గల భారతదేశమా? లేక విదేశీ ప్రభుత్వం సృష్టియైన నగరాలు గల భారతదేశమా? మనకు కావలసినది - అనేది నిర్ణయించుకోవాలి. ఈనాడు నగరాలు ఆధిపత్యం వహించి గ్రామాలను పీల్చి పిప్పి చేస్తూన్నవి. గ్రామాలు పతనమై పాడుపడిపోతూన్నవి. ఆ నగరాల ఆధిపత్యమే పోయినప్పుడు గ్రామాలకవి అనుయాయ సేవ చేయవలసి వచ్చునని నా ఖాదీ చిత్తవృత్తి చెప్పుచున్నది. గ్రామాలను దోచుకొనుట నిర్మాణయుత హింసయే యగును. మనము స్వరాజ్యమును అహింసా సిద్ధాంతముపై నిర్మించదలచుకొన్న యెడల మనము గ్రామాలకు వాటి స్థానము వాటికివ్వాలి. - హరిజన్ 20-1-40

## గ్రామ స్వరాజ్యము

గ్రామ స్వరాజ్యమంటే సంపూర్ణ ప్రజారాజ్యమని నా అభిప్రాయం. గ్రామం తన ముఖ్యావసరముల కోసం ప్రక్క వారి పైన ఆధారపడి యుండకూడదు. కాని ఆధారపడవలసిన అనేక ఇతర విషయాలలో గ్రామాలు పరస్పరం ఆధారపడి ఉండాలి. అనగా ప్రతి గ్రామము తన ఆహార ధాన్యాలను, తన బట్టలకు కావలసిన పత్తినీ తాను పండించుకోవాలి. పశువులకు బీళ్లు, పెద్ద వారికి విహారభూములు, పిల్లలకు ఆటస్థలాలు ఉండాలి. ప్రతి గ్రామంలోను వీటికి కాగా ఇంకా ఎక్కువ భూమి ఉండే పక్షంలో ఉపయోగకరములైన వాణిజ్యపు పంటను పండించుకోవాలి. కాని గంజాయి, పొగాకు, నల్లమందు మొదలైన వాటిని మాత్రం పండించరాదు. గ్రామంలో ఒక నాటకశాల, పాఠశాల, ఒక గ్రామ చావడి ఉండాలి. శుభ్రమైన నీరు లభించేటందుకు తగిన జలాశయం కూడా ఉండాలి. ఈ పని గ్రామంలోకి మంచి నీటి చెఱువులను గానీ, నూతులను గానీ తగిన అదుపులో ఉంచడం ద్వారా సాధించవచ్చును. ప్రాధమిక విద్యా పూర్తి అయ్యే వరకు నిర్బంధ విద్యావిధానం ఉంటుంది. సాధ్యమైనంత వరకు ప్రతి పనీ సహకార పద్ధతి పైన జరుగుతుంది. ఇప్పుడున్నట్లుగా సోపాన పరంపరగా ఉన్న అంటరానితనముతో కూడిన కులాలు అప్పుడుండవు. సత్యాగ్రహ నైపుణ్యముతో కూడిన అహింస, సహాయ నిరాకరణములు గ్రామ సమాజమునకు అండదండలుగా ఉంటవి. ప్రతి గ్రామంలోను, గ్రామ రక్షణ కోసం నిర్బంధంగా కాపలా కాయవలసిన మనుష్యుల పట్టీ ఒకటి ఉంటుంది. వారు ఆ పట్టీ ననుసరించి వంతులు ప్రకారం గ్రామానికి కాపలా కాయాలి. యుక్త వయసు వచ్చిన గ్రామస్తులందరూ స్త్రీలూ, పురుషులు, కలసి కనీసపు యోగ్యతలు కల ఐదుగురు పంచాయితీదార్లను యేటేటా ఎన్నుకొంటారు. వారే గ్రామ పాలకులుగా ఉంటారు. వీరికి కావలసిన అన్ని అధికారాలు ఉంటాయి. అయితే మనమంతా అనుకొనే అర్థంలో శిక్షలు వేయడం ఉండదు. ఈ పంచాయితీయే, శాసనసభగా, న్యాయస్థానములుగా, కార్యనిర్వాహకవర్గంగా ఆ సంవత్సరమంతా పని చేస్తుంది. గ్రామస్థుల నుండి శిస్తులు వసూలు చేసుకోవడమే పనిగా గల ప్రస్తుత ప్రభుత్వము యొక్క జోక్యం కూడా ఎక్కువ లేకుండా, ప్రతి గ్రామమూ అటువంటి ప్రజాసత్తాక రాజ్యంగా నేడే వ్యవహరించుకొనవచ్చును.

## సాంఘిక ఐక్యం

సాంఘికంగా ఐక్యమేర్పడుట అవసరం అయితే, అది రాజకీయం నిమిత్తం కృత్రిమమైనది కాక మనసార ఏర్పడవలె. ప్రతి కాంగ్రెసువాదీ ఏ మతస్థుడైనను అన్యమతస్థులతో సమభావం మైత్రి కలిగి వారి మతం పైన కూడ గౌరవము వుంచవలె.

అట్టి సుఖస్థితి యేర్పడితే, స్టేషనులలో హిందూ

**ప్రకృతి ప్రతి ఒక్కరి అవసరాలను తీరుస్తుంది. వారి దురాశలను మాత్రం కాదు.**

ముస్లిములకు వేర్వేరుగా నీరు టీ ఇట్లే వేర్వేరు స్కూళ్లు, ఆసుపత్రులు ఏర్పర్చుట – ఇట్టి సిగ్గు చేటు పద్ధతులుండవు. ఈ ఐక్యపు సత్కార్యము క్రాంతికరమైనది. దీనిని ధార్మికంగానే సాగించండి, అందుండి సహజంగా రాజకీయ ఫలమూ కలుగును శాసనసభల ద్వారానే ప్రాభవమేర్పడునను చిరభావన వట్టి భ్రమ. కొందరు బ్రిటీషు చరిత్ర ఆరగారగా చదివి, పార్లమెంటే ప్రజాశక్తి కాధారమని పొరబడుదురు. అసలు శక్తి ప్రజలదే. అది యెన్నికల ద్వారా ప్రతినిధి సభ్యులకు సంక్రమించును. అసలు ప్రజాశక్తి బలంగా లేకుంటే ఆ శాసన సభయు వ్యర్థం. ఈ సత్యమును ఈ 20 ఏండ్ల నుండి బోధించు చుంటిని. శాంతి ధిక్కారం అనే సత్యాగ్రహమే ప్రజాశక్తిని బలపర్చును. ప్రజలు రాజశాసనం ధిక్కరించి అందుచే గల్గు బాధలకు సిగ్గుపడితే, ప్రభుత్వ కార్యవర్గమంతా స్తంభించును.


## అస్పృశ్యతా నివారణ

హరిజనులనంటకుండు పద్ధతి హిందూ జాతికంతకూ కళంకం, శాపం, దానిని పోగొట్టుటకు కొందరు కాంగ్రెసువారు కృషి చేసినారు. కాని రాజకీయ కార్యపు దృష్టిలో ఆ భావన తప్పు, హిందూ మతం భద్రంగా నిల్చి యుండుటకే అస్పృశ్యతా నివారణ అవసరం. కనుక ఆ దృష్టితోనే యీ కార్యమును కాంగ్రెసు హిందువులందరూ సాగించితే, అందువల్ల సనాతనులతో ఎక్కువ పరిణామ మేర్పడును; ఈ కార్యం స్నేహభావంతో జరిగించండి. మన దేశంలో హరిజనులకున్నంత కేటాయింపు లోకంలో మరియే జాతికి లేదు. దానిని వెంటనే తొలగించుట హిందువులందరి ధర్మం. ఇది కష్టమనుకొన్నా స్వరాజ్య సౌధపు నిర్మాణంలో ఇది ముఖ్య భాగం. ముక్తి మార్గం చాలా యిరుకుదే; అందులో నిమ్నోన్నతాలు దాటవలె. అందులో మన అడుగు తప్పనిసరిగా వేయుచుంటేనే భద్రంగా శిఖం చేరి స్వాతంత్ర్య వాయువు ననుభవింతుము.

– గాంధీజీ

## మద్యపాన నిషేధం

త్రాగుడును మాన్పించుట సాంఘికంగా నైతికంగా అవశ్యకమైన సంస్కరణ సాంఘిక మైత్రి, అస్పృశ్యతా నివారణ వలె 1920 సం॥ నుండి ఇది కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమంలో చేరినదైనను, ఇందుకు కాంగ్రెసు వారు తగు శ్రద్ధ వహించలేదు. అహింసా కృషి వల్లనే గమ్యస్థలం చేరదలచినాము గదా. త్రాగుడు మత్తు వల్ల బాధితులగు కోట్ల కొలది ప్రజల యుద్ధరణను భావి ప్రభుత్వమునకే వదలుట భావ్యం కాదు. ❑




**టన్నుల కొద్దీ బోధనల కంటే ఒక ఔన్సు ఆచరణ గొప్పది.**

# స్వరాజ్యం - స్వపరిపాలన

- అజేయ కల్లం
రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధానకార్యదర్శి



గాంధీజీ మాటల్లో – 'స్వరాజ్యమనే పదం పవిత్రమైనదీ, వేదం నుండి పుట్టినదీను. స్వకీయ పరిపాలన, ఆత్మనిగ్రహాలు దాని అంతరార్థం. సాధారణంగా అనుకున్నట్టు 'స్వేచ్ఛ' అనేది కట్టుబాట్లన్నింటిని ఉల్లంఘించడం కాదు. బహుకొద్ది మంది అధికారాన్ని స్వీకరించడం వల్ల ప్రాప్తించేది స్వరాజ్యం కాదు. అధికారం దుర్వినియోగమవుతున్న సందర్భంలో దాన్ని అడ్డుకునే శక్తి ప్రతి ఒక్కరు సంపాదించినప్పుడే అది సార్ధకమవుతుంది. మరో విధంగా చెప్పాలంటే – అధికారాన్ని అదుపులో వుంచి, చక్కదిద్దే యోగ్యత కలిగేలా ప్రజాబహుళ్యాన్ని విజ్ఞానవంతులుగా చేయడంతో ప్రాప్తించేదే స్వరాజ్యం".



గ్రామీణ స్వరాజ్యమంటే గాంధీ గారి దృష్టిలో ఒక సంపూర్ణమైన రిపబ్లిక్. ప్రతి గ్రామం తన సొంత రంగస్థలాన్నీ, పాఠశాలనూ, కమ్యూనిటీ హాలునూ, మంచినీటి సరఫరానూ కలిగి ఉంటుంది. ప్రత్యేకంగా నిర్వహించే పంచాయతీ రిజిష్టర్లో నమోదైన జాబితా నుండి విధిగా, వంతుల వారీగా పనిచేసే రక్షకదళం గూడా ఉంటుంది. కాలవ్యవధిని అనుసరించి గ్రామ పంచాయతీ తన సమావేశాలు, న్యాయస్థానం విధులూ, నిర్వహణా యంత్రాంగాలను ఉమ్మడిగా నడిపిస్తుంది.

ఆయన అభిప్రాయంలో పెద్ద పెద్ద నగరాలు ఉచ్చులతో సమానం. అవి నిరుపయోగమైన లంపటాలు. ప్రజలు వాటిల్లో సంతోషంగా జీవించలేరు. దొంగల ముఠాలూ, దొమ్మీకి పాల్పడే వాళ్ళూ, వేశ్యలూ, దుర్వ్యసనాలూ వాటిల్లో వర్ధిల్లుతుంటాయి. పేదలను ధనికులు దోచుకుంటారు. ఇటీవల జర్మనీలో పట్టణాల నిర్వహణ మీద జరిగిన పరిశోధనలు గూడా చిన్న లేదా మధ్యస్థమైన బస్తీల నిర్మాణాన్ని సముచిత ప్రమాణాలతో పర్యావరణ పరిరక్షణ వంటి వాటిని దృష్టిలో ఉంచుకుని ప్రోత్సహించాలని సిఫారసు చేశాయి.

సజావైన పరిపాలన నెలకొనడానికి గాంధీజీ ప్రభుత్వ యంత్రాంగానికి సంబంధించి, అధికార వికేంద్రీకరణ వంటి కొన్ని మార్పులను సిఫారసు చేశారు. కేంద్రీకృతమైన అధికారం మూలంగా స్వరాజ్యానికి, అంటే సంపూర్ణమైన, వాస్తవమైన ప్రజాస్వామ్యానికి, ఆటంకాలు ఏర్పడతాయి. వాటిని నివారించేందుకు స్వయంపోషక, స్వయంపాలిత 'సత్యాగ్రాహి' గ్రామీణ ప్రజాసంఘాల కూటమితో ఏర్పడేదే ఆయన ఆలోచనలో ఆదర్శప్రాయమైన వ్యవస్థ అట్టడుగు అంచె మీద కేంద్ర ఒత్తిడి ఉండరాదు. గాంధీ గారి భావనలో అధికార వికేంద్రీకరణ అంటే గ్రామాలకు అధికారాన్ని పంచడం. "భారతదేశం ఆత్మ గ్రామాల్లోనే ఉంది" అనేది ఆయన ప్రకటన. ప్రతి గ్రామం స్వయం ప్రతిపత్తి కలిగి, స్వయంపోషకం కావాలనేది ఆయన అభిమతం.

### గాంధీజీ కలలు ఫలించేందుకు చేయవలసింది ఏమిటి ?

ఎన్నికైన ఏ ప్రభుత్వమైనా అటు పట్టణ ప్రజలకూ ఇటు గ్రామీణ ప్రజలకూ సేవలందించాలనేది చట్టపరమైన బాధ్యత. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయిక రాష్ట్రమైనందున దాదాపు 60 శాతం జనాభా నివసించేది గ్రామాలలోనే, వ్యవసాయానికీ, పశుపోషణకూ గ్రామాలే ఆధారం. పంపిణీ విధానాన్ని 60 శాతం

**ఉపాధ్యాయుడే విద్యార్థికి నిజమైన పాఠ్యగ్రంథం**

ప్రజలకు అందుబాటులో ఉంచడమనేది ప్రభుత్వం ఎదుర్కొనే అది పెద్ద సవాలు. యంత్రాంగంలోని లొసుగులూ, సమాచార వ్యవస్థలోని అంతరాయాల మూలంగా పంపిణీ విధానం మీద ప్రజల ఫిర్యాదులు ఉపశమనానికి నోచుకోని శాపం ప్లేగువ్యాధిలా సమాజాన్ని క్రుంగదీస్తూ వుంది. ఇప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు 6 లక్షల మంది శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు చేస్తున్నారు. అందులో 6 శాతమైనా గ్రామాల్లో భౌతికంగా నిలిచి పనిచేసేవాళ్ళు లేరనేది పచ్చి యదార్థం. వ్యవసాయం, సంక్షేమం, విద్య, వైద్యం వంటి పథకాలన్నింటికీ గ్రామమే కేంద్రమైన వాటిని అమలు పరిచేందుకు గ్రామీణ స్థాయిలో జవాబుదారుగా వుండే యంత్రాంగం లేకుండానే ఎంతో కాలంగా వీటి అమలుకు ప్రయత్నిస్తున్నారు.

పేపరు మీద చూస్తే గ్రామస్థాయిలో ఎంతో మంది సిబ్బంది ఉన్నట్లు అనిపిస్తుంది. పంచాయితీ సెక్రటరీ తదితర సిబ్బంది, వీ.ఆర్.ఓ, వి.ఆర్.ఏ, ఎ.ఎన్.ఎమ్, ఉపాధ్యాయులు, సుంకర, లైన్‌మ్యాన్, హెల్ప్, వీ.సి.ఓ., పశుపాలక సిబ్బంది, జేకేసీ యానిమేటర్, వ్యవసాయ శాఖ, ఫీల్డ్ అసిస్టెంట్స్, అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు తదితరులు. గ్రామస్థాయికి కేటాయించిన ఉద్యోగులు సగటున గ్రామానికి 10 మందినిగా తీసుకున్నా, బాధ్యతాయుతంగా వాళ్ళను అజమాయిషీ చేసే యంత్రాంగాన్ని ఆ స్థాయిలో తెలిసి తెలిసి నిర్మించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పథకాలను అమలుపరిచే శాఖలు దేనికదిగా కాగితాల మీద గ్రామీణ స్థాయి ఉద్యోగులకు ఆదేశాలు జారీ చెయ్యడం మినహా, ఆశించిన ప్రయోజనాలు సాధించేందుకు వాటిని స్థానికంగా ఎన్నుకోబడిన పాలక మండలి పర్యవేక్షణకు అప్పగించడం లేదు. దీని వల్ల ఎంతో ఉన్నతమైన ఆశయంతోనూ, సదుద్దేశ్యంతోనూ ప్రవేశపెట్టిన పథకాలన్నీ చివరకు గ్రామ స్థాయిలో గొడ్డుబోతున్నాయి.

ఈ సమస్యను అధిగమించడానికి కేరళ రాష్ట్రం తరహా గ్రామ సెక్రటేరియట్లు మనకు తప్పనిసరి. గ్రామ పరిధిలో వుండే సెక్రటేరియేట్‌కు గ్రామస్థాయి ఉద్యోగులందరూ హాజరవుతూ తమ నివేదికను నేరుగా గ్రామ పంచాయితీకి సమర్పిస్తారు. వివిధ శాఖల పథకాల అమలును గ్రామ పంచాయితీ అజమాయిషీ చేస్తుంది. గ్రామ స్థాయిలో విధులు నిర్వహించే వేరు వేరు శాఖ ఉద్యోగులంతా ఒకే గొడుగు కిందికి వస్తారు. ఆ ఉద్యోగుల జీతభత్యాలను ప్రభుత్వం నేరుగా విడుదల చేసేందుకు మారుగా, గ్రాంటు రూపంలో గ్రామ పంచాయితీకి దఖలు పరుస్తుంది. ఆ స్థాయిలో పనిచేసే ఉద్యోగస్తులు దొరకని సందర్భాల్లో, తగిన విద్యార్హత, తర్ఫీదు కలిగి, పదవిని విరమించిన సాంకేతిక నిపుణులను గ్రామ పంచాయతే నియమించుకుంటుంది. ఈ విధానం వల్ల పరిపాలనలో జవాబుదారీతనాన్ని ప్రవేశపెట్టినట్టవుతుంది.

ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల గ్రామ పంచాయితీలున్నాయి. పై తరహా పాలన కోసం వాటిని జనాభా ప్రాతిపదికన ఇంచుమించు 10 వేల యూనిట్లుగా కుదించుకోవచ్చు. అప్పుడు పథకాల అమలుకు సంబంధించిన సమాచారాన్ని గ్రామస్థాయి నుండి నేరుగా ఫోన్ ద్వారానో, ఇంటర్నెట్ ద్వారానో ఏరోజుకారోజు సేకరించుకోవచ్చు. తప్పుడు నివేదికలూ, కాలయాపనల వంటి అవరోధాలను చాలా వరకు అధిగమించవచ్చు. రేషన్‌కార్డులూ, పాస్‌పుస్తకాలూ, సర్టిఫికెట్ల వంటి ప్రాథమికమైన సదుపాయాలు గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి రావడంతో ప్రమాదస్థాయికి చేరుకున్న అవినీతిని కనిష్ఠస్థాయికి దించుకోవచ్చు. ఏదైనా ఒక గ్రామపంచాయతీ అక్రమాలకు చోటిస్తే, ప్రజలు అక్కడికక్కడే నిలదీయవచ్చు. హద్దులు మీరితే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి, సమస్యలను పరిష్కరించవచ్చు. తదుపరి ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం ఆ పాలకవర్గానికి నేర్పించగలరు కూడా.

గ్రామ పంచాయతీలకు బాధ్యతలు బదిలీ చేయడం వల్ల మండల, జిల్లా, రాష్ట్ర స్థాయికి చేరుతున్న సమస్యల్లో 90 శాతం వరకు గ్రామస్థాయిలోనే పరిష్కారమవుతాయి. గ్రామస్థాయికి సాధ్యపడని కార్యక్రమాలు మాత్రమే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలకు మిగలటంతో ఎగువ స్థాయిలో పనిభారం తగ్గుతుంది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తన దృష్టిని పాలనా సంస్కరణలూ, మౌలిక సదుపాయాల ఏర్పాటూ, పారిశ్రామిక ప్రగతీ వంటి బృహత్కార్యక్రమాల మీద కేంద్రీకరించడానికి వీలవుతుంది. ఈ విధానం అమలులోకొచ్చిన కొద్ది కాలానికే ఫలితాలు గూడా స్పష్టంగా వెలుగులోకొస్తాయి.

**మేలు కొలుపు పుస్తకం నుండి** ❑

**మంచి లక్ష్యాల సాధనకు మంచి మార్గాలనే ఎంచుకోవాలి.**

# గాంధీని యువతరం గ్రహించగలుగుతుందా ?

**అవిజిత్ పాథక్**
సామాజిక శాస్త్ర ఆచార్యులు
జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ



ప్రతీ సంవత్సరం అక్టోబర్ 2న నేను ఒకలాంటి అసౌకర్యానికి గురవుతాను. రాజ్‌ఘాట్ నుంచి పార్లమెంట్ దాకా, రాజకీయ పార్టీల 'ప్రజానుకూల' విధానాల ప్రకటనల నుంచి శూన్య నినాదాల దాకా అన్నింటా నిర్జీవుడైన గాంధీయే అనుభవంలోకి వస్తాడు నాకు. కట్టకట్టిన సూత్రాల 'అధికారిక' మూస గాంధీ తప్ప, నిజమైన, సజీవుడైన గాంధీ, కులం కట్టుబాట్లను తెంచుకుని పై చదువుల కోసం ఇంగ్లండ్ వెళ్ళే సాహసం చేసిన ప్రయోగశీలి అయిన మోహన్‌దాస్, సంపూర్ణమైన విద్య కోసం టాల్‌స్టాయ్ ఫామ్‌లో భౌతిక మానసికతల్ని మిళితం చేసి పాదుల్లో ఒంపిన ఉపాధ్యాయ గాంధీ, నిత్యావశ్యకమైన ఉప్పును ఒక ప్రజా ఉద్యమంగా మలచగలిగిన సృజనకారుడైన గాంధీ, బక్కచిక్కిన శరీరంతో నేఖాలీ గ్రామాల్లో చుట్టూ కమ్ముకున్న చీకట్ల మధ్య నుంచి సత్యదీపం పట్టుకుని నడచిన స్థిర సంకల్పుడైన గాంధీ – ఎక్కడా కనపడడు. బదులుగా, కర్మకాండగా మార్చి వేయడిన తన సిద్ధాంతాల మధ్య ఒక నిశ్చల ప్రతీకగా మాత్రమే ఆయన గోచరిస్తాడు. ఇదే ననుకుంటాను విప్లవాత్మకమైన యువతరం నుంచి గాంధీని వేరు చేసింది.

భగత్‌సింగ్ గురించి, అంబేద్కర్ గురించి మాట్లాడగలిగి, మార్క్స్‌ను చేగువేరాను కాల్పనిక స్థాయిలో సృష్టించుకోగలిగిన ఈ తరం గాంధీతో అర్థవంతమైన, సృజనాత్మకమైన ఒప్పందం కుదుర్చుకోలేకపోతోంది. మన విద్యల్లో, అధ్యయన బోధనల్లో గాంధీని సరిగా చిత్రీకరించలేకపోవడం అనే దారుణ వైఫల్య ఫలితంగా అనేక మంది యువతకు ఆయనొక ఆధునికేతరునిగా, నైష్ఠికునిగా, ఆచరణ సాధ్యం కాని సిద్ధాంతాలను పట్టుకుని వేలాడిన పూర్వాచార పరాయణునిగానే కనిపిస్తున్నాడు. ఒక అధ్యాపకునిగా సంబంధిత పౌరునిగా ఈ పరిస్థితి మారాలనీ, యువతని సజీవమైన గాంధీ ప్రపంచంలోకి ఆహ్వానించాలని ఆశిస్తున్నాను. అది పరిపూర్ణుడై శిలా సదృశుడై మ్యూజియంలో ఉంచబడిన గాంధీ ఉండే ప్రపంచం కాదు. అసమంజసాలు, వైరుధ్యాలు ఉన్నప్పటికీ దేనినైనా సాధ్యం చెయ్యగల అపారమైన శక్తి కలిగిన గాంధీ ప్రపంచం అది.

మరిన్ని విషయాలు మాట్లాడుకోబోయే ముందు మౌలిక మార్పు సాధించడానికీ నిర్భీతి కలిగి ఉండడానికీ మధ్య ఉండే సంబంధాన్ని చూడడం అవసరం. మనం భగత్‌సింగ్ డైరీని, ముఖ్యంగా తానెందుకు నాస్తికుడయ్యాడో రాసిన భాగాన్ని చదువుతున్నప్పుడు ప్రభావశీలమైన ఒక సాహస వ్యక్తీకరణను అనుభూతి చెందుతాం. అది ఒకానొక మానసిక సంక్షోభ సమయాన కూడా నిబద్ధతను, భావ స్వచ్ఛతను నిలుపుకోగల సాహసం. కాదూ, దేవుడూ, మరణానంతర జీవితం వంటి వాటి ద్వారా ఓదార్పును అంగీకరించని సాహసం.

సందేహం లేదు. అది యువతను ఆకర్షిస్తుంది. మరైతే, గాంధీ సంగతేమిటి ? ఆయన మతత్వం (religiosity) సాహస తత్వానికి ఏ మాత్రం తక్కువ కాదు. అది సావర్కర్, జిన్నా వంటి వారు సామాజిక రాజకీయ ఆవరణాన్ని మతతత్వం (communalism) తో విచ్ఛిన్నం చేస్తున్న కాలంలో సాంస్కృతిక ఐక్యతను నిలబెట్టగలిగిన సాహసం. అంబేద్కర్ మహద్ సత్యాగ్రహం ధైర్యానికి ఒక మచ్చుతునక అయితే, సమాజంలోని ఉపశ్రేణులు బ్రాహ్మణ భావజాలాన్ని ప్రతిఘటించడం నిర్భీతికి ఉదాహరణ అయితే, గాంధీ మన చైతన్యంలోకి ఒక కొత్త ధైర్యాన్ని దృక్పథాన్ని చొప్పించాడు. అది సహాయ నిరాకరణ తత్వం ద్వారా అత్యంత బలీయమైన వలసవాద ఆధునికతను ఎదుర్కొనే ధైర్యం. సత్యాగ్రహ ఆచరణలోని నైతికత, సహనం, చివరికి తనను తానొక శూన్యంగా మార్చుకోవడం ద్వారా అస్తమించే కళ వంటి గుణాలను అలవరచుకునే ధైర్యం.

మార్క్స్ 19వ శతాబ్దం చివరి భాగంలో మరణించినా ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థకు ఉండే చలనశీలత వల్ల, దాని ఆధిపత్య యంత్రాంగం, సాంస్కృతిక పరిశ్రమల వల్ల ఆంటోనియో గ్రాంషి, హెర్బెర్ట్ మార్క్యూజ్ వంటి సృజనశీలురైన మార్క్సిస్టులు మార్క్స్‌ను పునరావిష్కరణ చేసి ఆయన విమర్శనాత్మకతను కొత్త తరానికి ప్రాసంగికం చేశారు. అట్లాగే, మారుతున్న కాలంలో గాంధీ సాత్విక నిరోధానికి కొత్త భాషను సమకూర్చడం ద్వారా ఆయన్ని పునరావిష్కరణ చేయవచ్చని నేను నమ్ముతున్నాను. గాంధీ కాలం

నాటి వలస వాదం, మతసంస్కరణ, జాతీయోద్యమం వంటి అంశాల నుంచి నూతన సరళీకృతపెట్టుబడి, సమరశీల సాంస్కృతిక జాతీయ వాదం, మార్కెట్ ప్రేరిత వినియోగతత్వం, సాంకేతిక కేంద్రిత అభివృద్ధి మొదలైన వాటితో కూడిన నూతన వాస్తవికత వైపుకు మనం జరిగాం. రాజకీయ సాంస్కృతిక ఆవరణలో దాని ఫలితాలు ఎట్లా ఉన్నాయో చూడండి. 'గుడ్ గవర్నెన్స్' వంటి నినాదాల మత్తు వెనుక – ఉన్న వాడికీ లేని వాడికీ మధ్య, నగరాలకూ గ్రామాలకు మధ్య, టెక్నో మానేజర్లకూ రైతులకూ మధ్య అంతరం పెరిగిపోతోంది. పెంచి పోషించబడుతున్న సాంస్కృతిక జాతీయ వాదం మానవ చైతన్యంలోకి యుద్ధతత్వాన్ని ప్రవేశపెడుతోంది. విస్తరిస్తున్న సాంస్కృతిక పరిశ్రమ మధ్య తరగతిని ఆశపోతులైన వినియోగదారులుగాను, అన్ని రకాల 'app'లను సాంకేతిక పరిష్కారాలను దిగుబడి చేసుకునే దేన్నీ వ్యతిరేకించని వర్గంగానో తయారుచేస్తోంది. ఫలితం అనేకానేక రూపాల్లో విస్తరిస్తున్న హింస. పర్యావరణ అసమతుల్యత వల్ల ఆవిష్కృతమైన ప్రమాదకర ప్రపంచం. గోసంరక్షణ పేరిట మూక దాడులతో 'ఇతరుల'ను వేలెత్తి చూపించే పశు ప్రవృత్తి సాధారణమైపోవడం. వేగంగా విస్తరిస్తున్న అశ్లీల చిత్ర సంస్కృతి మొదలుకుని సమస్త కుల, మత, లింగ అంతరాల్లో యథాతథ స్థితి వాదన. ఈ వెర్రి నుంచి బయట పడడానికి సూక్ష్మబుద్ధి గల యువతకు గాంధీలో ఏమైనా దొరుకుతుందా అనేదే ప్రశ్న.

ఇదుగో ఈ సందర్భంలోనే రెండు ముఖ్యమైన గాంధీ భావనల్ని ప్రస్తావించదలిచాను. అవి ఒకటి ఆత్మశక్తి (Soul force), రెండవది సాధు అరాచకం (Gentle anarchy). హిందస్వరాజ్‌లో గాంధీ ఆత్మశక్తిని మృగశక్తి (brute force) కి ప్రతిగా నిలబెట్టాడు. అన్ని కోరికలను తీర్చుకోవడానికి అర్రులు చాచే భావోద్రేక స్థితి మీద మృగశక్తి ఆధారపడితే ఆత్మ నిగ్రహం, శరీర, ఆహార జీవిత అవసరాల మీద నియంత్రణ, లోపలి శక్తుల వినియోగం వంటివి ఆత్మశక్తికి ఆలంబనలు. ఎరిక్ ఫ్రామ్‌ను ఉదహరించదలిస్తే ఆయన కూడా గాంధీతో ఏకీభవిస్తూ కలిగి ఉండడం (having) తానై ఉండడం (being) లను ప్రస్తావిస్తాడు. ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ, దాన్ని నిర్మిస్తున్న వినియోగదారీ తత్వమూ 'కలిగి ఉండే' అస్తిత్వాన్ని పోషిస్తాయి. ఇందులో అంతర్లీనంగా హింస దాగి ఉంటుంది. ప్రతి అనుబంధమూ ప్రకృతితోనైనా, సహచర మానవులతోనైనా సాంకేతికమే అవుతుంది. అందుకు విరుద్ధంగా 'తానై ఉండే' అస్తిత్వం, గాంధీ ఆత్మశక్తి మాదిరిగానే మన లోపలి ఖజానాలను తవ్వి తీసి నైతిక శక్తిని మనం మళ్ళీ మళ్ళీ పొందేటట్టు చేస్తుంది. మన మీద మనం నియంత్రణ కోల్పోతున్న వైనాన్ని ఒక్కసారి గమనించండి. నాడీ నియంత్రణ కోల్పోయినట్టు సాఫ్ట్‌వేర్ పరికరాల ఉపయోగంలో నిమగ్నమై పోవడంలోనో లేక తయారు చేయబడిన అవసరాలను తీర్చుకోవడానికి పిచ్చెక్కినట్టు కోరికలను పెంచుకుంటూ పోవడంలోను పడి సాంకేతిక పెట్టుబడి వినియోగదారీ మత్తుకు మనల్ని బానిసల్ని చెయ్యడాన్ని నిరోధించే ధైర్యాన్ని కోల్పోతున్నాం. గాంధీ ఆత్మశక్తిని అర్ధవంతంగా పునరావిష్కరణ చెయ్యగలిగితే అది యువతకు ఇదిగో ఈ నూతన సాంఘిక నియంత్రణకు వ్యతిరేకంగా అనుసరించదగిన, శక్తివంతమైన నిరోధ తత్వాన్ని ఇవ్వగలదని నమ్ముతున్నాను. రాజ్యానికున్న అసాధారణ అధికారం పట్ల దాని కేంద్రీకృత, ఉద్యోగస్వామ్య లక్షణాల పట్ల ఆశాభావం ఉన్న గాంధీ ప్రవచించిన 'సాధు అరాచకం'లో సైతం గణనీయమైనది కొంత లేకపోలేదు. గాంధీ భావించినట్టుగా ఒక రకంగా అవి ప్రజల్ని నిరధికారికం చేస్తుంది. హిందస్వరాజ్‌లో చెప్పినట్టు ప్రజల్ని న్యాయస్థానాల మీద వకీళ్ళ మీద విపరీతంగా ఆధారపడేటట్టు చేస్తుంది. ఎక్కడికక్కడ తమలో తాము గిర్రున తిరిగే జలసుళ్ళ (Oceanic circles) వంటి వికేంద్రిత, స్వాధికార వర్గాల గురించి విమర్శనాత్మక పరిశీలన జరగాలనే విషయాన్ని నేను అంగీకరిస్తాను. అయినప్పటికీ సమాజాన్ని ప్రజాస్వామీకరించ దంలో, అధికారంలో నియంతృత్వ బీజాలను నిర్మూలించడంలో ఉద్యోగస్వామ్య అధికార కేంద్రీకృత రాజ్యం స్థానాన ప్రజల చేతుల్లోని నైతిక రాజకీయాధికారమే బలమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని భావిస్తున్నాను.

1948 జనవరి 30వ తేదీన ఢిల్లీలోని బిర్లా గృహంలో ప్రార్ధనా సమావేశానికి అడుగులు వేస్తూ గాంధీ భారత ఉపఖండంలో వెల్లువెత్తుతున్న మానసిక అస్వస్థత వెనుక ఈ వివేకాన్నే చూడడానికి ప్రయత్నించాడు. అయితే నాథూరాం గాడ్సే, అతన్ని సృష్టించిన తీవ్ర జాతీయవాదం భిన్నంగా ఆలోచించడం వేరే కథ. గాంధీని చంపడం అంటే ఒక మహా స్వప్నాన్ని కూల్చడమేనని, ఒక సాధ్యాన్ని నిరోధించడమేనని, ఆ పైశాచిక శక్తి సమాజం నుంచి ఇంకా అదృశ్యం కాలేదనీ యువతరం గ్రహించగలుగుతుందా ? ❑

**ఓర్పు వుంటే విఫలమయ్యే పని కూడా ఫలిస్తుంది**

# మహాత్ముడు – ఆర్.ఎస్.ఎస్.



**రామచంద్ర గుహ**
చరిత్రకారుడు

నయవంచన అంటే 'ధర్మాన్ని అధర్మం ప్రశంసించడమే' నని 17వ శతాబ్ది ప్రముఖ ఫ్రెంచ్ రచయిత ఒకరు నిర్వచించారు. అక్టోబర్ 2న ఈ సామాన్య సత్యం భారతీయులకు అనేక విధాలుగా తేటతెల్లమవనున్నది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏ వ్యక్తినయితే ఆయన జీవిత కాలంలో తీవ్రంగా దూషించిందో, ఆ కీర్తిశేషునికి నివాళులర్పించడానికి ఆ రోజున సంఘ్ ప్రచారక్‌లు– ప్రధానమంత్రి మొదలు పల్లె స్థాయి స్వయం సేవకుడి దాకా– తప్పక బారులు తీరుతారు. మహాత్ముని గురించి స్వయం సేవకులు బహిరంగంగా ఏమి చెప్పినప్పటికీ, ఆయనను గౌరవించే విషయంలో వారికి ఇప్పటికీ తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయి.



మహాత్ముని 150 వ జయంత్యుత్సవాలను మరో ఐదు రోజుల్లో జరుపుకోనున్న శుభ సందర్భం లో ఈ కాలమ్ ప్రచురితమవనున్నది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) మాజీ ప్రచారక్ ఒకరు దేశ ప్రధానమంత్రిగా వున్న; జాతి రాజకీయ, సామాజిక జీవనంలో ఆరెస్సెస్ ప్రాబల్యం అంతకంతకూ పెరిగిపోతోన్న కాలంలో మనం మన జాతిపిత నూట యాభయ్యవ జయంతిని జరుపుకోనున్నాం. అక్టోబర్ 2 న, గాంధీజీ గురించి ప్రధానమంత్రితో పాటు ఆరెస్సెస్తో సంబంధమున్న ఇతర ప్రముఖులు చాలా మంచి మాటలు చెప్పనున్నారు. చరిత్ర ఏమి చెప్పిందనే విషయమై పాఠకులను అప్రమత్తం చేయడం చాలా ముఖ్యమని భావిస్తున్నాను. మహాత్ముడు ఈ ధాత్రిపై నడయాడిన కాలంలో ఆరెస్సెస్, గాంధీ మధ్య వాస్తవ సంబంధాలను విశదం చేయాలని సంకల్పించాను.

శతాధిక సంపుటాలుగా ప్రచురితమైన 'కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మహాత్మాగాంధీ' లో ఆరెస్సెస్ గురించిన తొలి ప్రస్తావన 87 వ సంపుటంలో కనపడుతుంది. 1947 ఏప్రిల్ నాటి విషయమది. ఢిల్లీలో ఒక ప్రార్థనా సమావేశంలో, హిందూ–ముస్లిం సమైక్యత గురించి నొక్కి చెబుతూ మహాత్ముడు మాట్లాడారు. ప్రార్థనా సమావేశాలలో ఇస్లాం పవిత్ర గ్రంథం 'ఖురాన్' ప్రవచనాలను, హిందూ ధర్మాన్ని సుబోధకం చేసే 'భగవద్గీత' శ్లోకాలను ఉటంకిస్తూ అవి ఒకే సత్యాన్ని భిన్నరీతుల్లో ఎలా చెబుతున్నాయో గాంధీజీ వివరించారు. భిన్న మతాల ధర్మసూక్తులను గాంధీ ఇలా ఉటంకించడం పట్ల అప్పట్లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆ నిరసనల్లో ఆరెస్సెస్ ప్రమేయమున్నదని వార్తలు వెలువడ్డాయి. అయితే సదరు నిరసనల్లో తమకు ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేస్తూ ఆరెస్సెస్ నుంచి తనకు ఒక లేఖ అందిందని గాంధీజీ పేర్కొన్నారు.

1947 సెప్టెంబర్లో న్యూఢిల్లీలో ఆరెస్సెస్ కార్యకర్తల బృందం ఒకదానితో గాంధీజీ సమావేశ మయ్యారు. 'ప్రయోజనకరమైన సేవలు అందించేందుకు ఆత్మ త్యాగం ఒక్కటే సరిపోదు. లక్ష్య శుద్ధి, సమాజ సమస్యల పట్ల సరైన అవగాహన ఉండడం కూడా ఎంతైనా అవసరమని' సంఘ్ కార్యకర్తలకు గాంధీ చెప్పాడు. ముస్లిముల విషయంలో ఆరెస్సెస్ నిష్పాక్షిక భావంతో వ్యవహరించదని తాను విన్నానని ఆయన పేర్కొన్నారు. హిందూ మతం కేవలం కొద్దిమందికే పరిమితమైన మతం కాదని తాను విశ్వసిస్తానని మహాత్ముడు అన్నారు. హిందువులకు ఇస్లాంతో ఎలాంటి ఘర్షణ లేదని ఆయన వక్కాణించారు.

**ఏ జాతి అయినా కోటీశ్వరులు లేకుండా మనుగడ సాగించగలదు కానీ శ్రామికులు లేకుండా సాగించలేదు**

హిందువులు- ముస్లిముల మధ్య హింసాకాండను నివారించడానికై 1947 సెప్టెంబర్ తొలి దినాల్లో మహాత్ముడు కలకత్తాలో నిరాహార దీక్ష చేపట్టారు. శాంతి స్థాపనకు ఆయన చేస్తున్న ప్రయత్నాలను ఆరెస్సెస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' అపహసించింది. 'రోమ్ నగరం తగులబడిపోతుండగా నీరో చక్రవర్తి ఫిడేలు వాయిస్తూ ఉండిపోయాడన్న' నానుడిని ఉటంకిస్తూ 'ఆర్గనైజర్' ఇలా వ్యాఖ్యానించింది: 'చరిత్ర మన కళ్ళ ముందు పునరావృతమవుతున్నది. ఇస్లాంను మహాత్మాగాంధీ ప్రశంసిస్తున్నారు. అల్లా హో అక్బర్ అని ఘోషిస్తున్నారు. ఒక పక్క పంజాబ్‌లోను, ఇతర రాష్ట్రాలలోను ఇస్లాం పేరిట అత్యంత అమానుషాలు చోటు చేసుకుంటుండగా, మరో పక్క హిందువులు కూడా అల్లా హో అక్బర్ అని నినదించాలని ఆయన ఉపదేశిస్తున్నారు!'

నిజానికి గాంధీ నిరాహార దీక్షతో కలకత్తాలో మతఘర్షణలు నిలిచిపోయాయి. హిందువులు -ముస్లిముల మధ్య శాంతి సామరస్యాలు నెలకొన్నాయి. 77 ఏళ్ళ ఆ వృద్ధమూర్తి తన నైతిక శక్తితో, ఘర్షించుకుంటున్న భిన్న మత వర్గాల మధ్య పరస్పర విశ్వాసాన్ని పాదుకొల్పడంలో సఫలమయ్యారు. న్యూఢిల్లీలో మత ఘర్షణలను నివారించేందుకు, భయాందోళనలతో పాకిస్థాన్‌కు వెళ్ళవలసిన అవసరం లేదని అక్కడి ముస్లిములకు నచ్చచెప్పేందుకు మహాత్ముడు 1947 సెప్టెంబర్ 7న దేశ రాజధానికి వచ్చారు. ఇక్కడ ఆయన ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ ఎమ్. ఎస్. గోల్వాల్కర్తో సమావేశమయ్యారు. సెప్టెంబర్ 12న ఒక ప్రార్థనా సమావేశంలో గాంధీజీ ప్రసంగాన్ని గురించిన వార్త కథనం ఇలా ముగిసింది: 'చివరగా, ఆరెస్సెస్ అధిపతితో తాను, దిన్షా మెహతా జరిపిన సంభాషణల గురించి గాంధీజీ ప్రస్తావించారు. ఆరెస్సెస్ హస్తాలు రక్తపంకిలమయ్యాయని గాంధీజీ అన్నారు. ఇందులో నిజం లేదని ఆరెస్సెస్ అధినేత ఖండించారు. తమ సంస్థ ఏ మనిషికీ శత్రువు కాదని ఆయన స్పష్టం చేశారు. ముసములను సంహరించాలన్న భావన తమకు లేదని, హిందుస్థాన్‌ను తమ శక్తి మేర సంరక్షించాలన్నదే తమ అభిమతమని అన్నారు. తమ సంస్థ (ఆరెస్సెస్) శాంతి స్థాపనకు నిబద్ధమయిందని పేర్కొంటూ గాంధీజీ తన అభిప్రాయాలను బహిరంగంగా తెలపాలని గోల్వాల్కర్ కోరారు'. గాంధీకి గోల్వాల్కర్ చెప్పింది నిజం కాదు. ఆరెస్సెస్, దాని అధినేత ముస్లిములను ద్వేషించారు. గాంధీ జీవితచరిత్ర రాసే కృషిలో భాగంగా నేను ఆ కీలక నెలల (1947 సెప్టెంబర్- 1948 జనవరి) కు సంబంధించిన ఢిల్లీ పోలీసు రికార్డులను అధ్యయనం చేశాను. ఆరెస్సెస్ సమావేశాలలో గాంధీ, ముస్లిములపై విద్వేష పూరిత విమర్శలు వెల్లువెత్తిన కథనాలు ఆ రికార్డులలో నాకు కొల్లలుగా కన్పించాయి. 1947 అక్టోబర్ చివరి వారంలో జరిగిన ఒక ఆరెస్సెస్ సమావేశం గురించిన పోలీసు నివేదిక ఇలా పేర్కొంది: 'ఢిల్లీలో కొంత కాలం క్రితం ముస్లిములకు వ్యతిరేకంగా చోటు చేసుకున్న తీవ్ర హింసాత్మక దాడుల వంటివి మరోసారి జరిగినప్పుడు మాత్రమే ముస్లిములు భారత్ నుంచి పూర్తిగా నిష్క్రమిస్తారని సంఘ్ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. మహాత్ముడు ఢిల్లీ నుంచి ఎప్పుడు వెళ్ళిపోతారా అని వారు ఎదురు చూస్తున్నారు. మహాత్ముడు ఢిల్లీలో ఉన్నంతవరకు ముస్లిములకు వ్యతిరేకంగా తాము రూపొందించుకున్న పథకాలను అమలు పరచడం సాధ్యం కాదని సంఘ్‌కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు'.

గాంధీ ఈ పోలీసు నివేదికలను చదివి వుండే అవకాశం లేదు. అయితే ఆరెస్సెస్ దాని అధినేత చెబుతున్న విషయాలు అబద్ధాలని ఆయన తన సొంత ఆధారాలతో ధ్రువీకరించు కున్నారు. 1947 నవంబర్ 15న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో గాంధీ ఒక స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. కాంగ్రెస్ వాదులు తమ సంస్థ మౌలిక ఆదర్శాలు, లక్ష్యాలకు నిబద్ధమయి వుండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హిందూ, ముస్లిం సమైక్యతే కాంగ్రెస్ లక్ష్యమని, ఇందుకు కాంగ్రెస్ ఆరు దశాబ్దాలకు పైగా కృషి చేస్తూ వస్తోందని ఆయన ఆ ప్రసంగంలో అన్నారు. భారత్‌లో ఉండిపోయిన ముసములకు పూర్తి భద్రతా భావం కలిగించాలని తన సహచరులకు ఆయన విజ్ఞప్తి చేశారు. హింసాత్మక దౌర్జన్యాలు హిందూ మతాన్ని గానీ, సిక్కు మతాన్ని గానీ కాపాడలేవని ఆయన స్పష్టం చేశారు. గాంధీజీ ఇంకా ఇలా అన్నారు: 'ఆరెస్సెస్ గురించి నేను చాలా విషయాలు విన్నాను. ఈ దుండగాలన్నిటికీ ఆ సంస్థే మూల కారణమని కూడా విన్నాను. వెయ్యి ఖడ్గాల కంటే ప్రజాభిప్రాయమే మహా శక్తిమంతమయినదన్న సత్యాన్ని మనం విస్మరించకూడదు. అద్దూ

**రాత్రి పూట కూడా స్త్రీలు స్వేచ్ఛగా సంచరించగలిగినప్పుడే అది నిజమైన స్వాతంత్ర్యం అవుతుంది**

అదుపూ లేని హత్యలతో హిందూ మతానికి రక్షణ సమకూరదు. ఇప్పుడు మీరు స్వేచ్ఛా పౌరులు. ఈ స్వేచ్ఛను మీరు కాపాడుకోవాలి, మీరు మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. ధైర్యంగా ఉండాలి. నిరంతర జాగరూకతతో వ్యవహరించాలి. లేని పక్షంలో మీరు ఎంతో కష్టం మీద సాధించుకున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోతారు. అటువంటి దుర్దినం రాకూదని నేను ఆశిస్తున్నాను'.

ఆరెస్సెస్ పట్ల గాంధీకి ఇంకెంత మాత్రం భ్రమలు లేవు. ఇక సంఘ్‌లో మహాత్ముని పట్ల ద్వేష భావం మరింతగా పెరిగిపోయింది. 1947 డిసెంబర్ మొదటి వారంలో ఢిల్లీలో ఆరెస్సెస్ కార్యకర్తల సమావేశంలో గోల్వాల్కర్ ప్రసంగిస్తూ ఇలా అన్నారు: 'ముస్లిములు భారత్‌లో ఉండిపోయేలా చేయడం ఎవరికీ సాధ్యం కాదు. వారు వెంటనే ఈ దేశం నుంచి వెళ్ళిపోవాలి. ముస్లిములు భారత్‌లో వుండిపోవాలని మహాత్ముడు కోరుతున్నారు. వచ్చే ఎన్నికలలో ముస్లిముల ఓట్ల ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రయోజనం పొందాలన్నదే ఆయన లక్ష్యం. అయితే ఎన్నికలు వచ్చేనాటికి ఒక్క ముస్లిం కూడా భారత్‌లో ఉండబోడు. మహాత్ముడు వారిని ఇంకెంత మాత్రం తప్పు దోవ పట్టించలేరు. అటువంటి వారిని మౌనం వహించేలా చేసేందుకు అవసరమైన సాధనాలు మనకు ఉన్నాయి. అయితే హిందువులకు హాని తలపెట్టడం మన సంప్రదాయం కాదు. అనివార్యమయితే అటువంటి చర్యలు చేపట్టేందుకు వెనుకాడే ప్రసక్తి లేదు'.

1948 జనవరిలో మహాత్ముడు న్యూఢిల్లీలో నిరాహారదీక్ష చేపట్టారు. కలకత్తాలో వలే, దేశ రాజధానిలో కూడా ఆయన దీక్ష వల్ల హిందువులు, ముస్లిముల మధ్య శాంతి సామరస్యాలు నెలకొన్నాయి. ఆ తరువాత పాకిస్థాన్ వెళ్ళాలని ఆయన సంకల్పించుకున్నారు. ఆ దేశంలోని హిందువులు, సిక్కులకు సంపూర్ణ రక్షణ సమకూర్చాలనేది ఆయన లక్ష్యం. అయితే జనవరి 30 న నాథూరామ్ గాడ్సే అనే ఆరెస్సెస్ మాజీ సభ్యుడు మహాత్ముడిని శాశ్వతంగా బలిగొన్నాడు. ఆరెస్సెస్‌ను తక్షణమే నిషేధించారు. గోల్వాల్కర్‌తో సహా సంఘ్ నాయకులు పలువురిని జైలుకు పంపించారు.

గోల్వాల్కర్ సంభాషణలు, ప్రసంగాల సంకలనమయిన 'బంచ్ ఆఫ్ థాట్స్' (1966లో ప్రచురితమయింది) అనే పుస్తకం ఆరెస్సెస్‌కు బైబిల్ లాంటిది. 'ఏ మనిషికీ ఆరెస్సెస్ శత్రువు కాదని' గోల్వాల్కర్ ఒకసారి గాంధీజీకి చెప్పారు. ఈ అభిభాషణ ఒక స్వతస్సిద్ధ అసత్యం మన జాతికి ముగ్గురు శత్రువులు వున్నారని, వారితో మన జాతీయ భద్రతకు ఎనలేని ముప్పు వాటిల్లనున్నదని గోల్వాల్కర్ తన పుస్తకంలో పేర్కొన్నారు. ఆ ముగ్గురు ముస్లిములు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు అని ఆయన విశ్వసించారు. స్వాతంత్ర్యం వచ్చిన రెండు దశాబ్దాల తరువాత కూడా భారతీయ ముస్లిముల పట్ల ఆయన తన అకారణ భయాన్ని, విద్వేషాన్ని విడనాడలేదు. ఆసేతు హిమాచలం 'మినీ పాకిస్థాన్లు' చాలా ఉన్నాయని గోల్వాల్కర్ వ్యాఖ్యానించారు.


నయవంచన అంటే 'ధర్మాన్ని అధర్మం ప్రశంసించడమే'నని 17వ శతాబ్ది ప్రముఖ ఫ్రెంచ్ రచయిత La Rochefoucald (1613-80) నిర్వచించారు. అక్టోబర్ 2న ఈ సామాన్య సత్యం భారతీయులకు అనేక విధాలుగా తేటతెల్లమవనున్నది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏ వ్యక్తినయితే ఆయన జీవిత కాలంలో తీవ్రంగా దూషించిందో, ఆ కీర్తిశేషునికి నివాళులర్పించడానికి ఆ రోజున సంఘ్ ప్రచారక్‌లు– ప్రధానమంత్రి మొదలు పల్లె స్థాయి సంఘీయుడి దాకా– తప్పక బారులు తీరుతారు. భారత్ కేవలం హిందువులకే గాక అన్ని మతాల వారికీ సమత, మమత పంచే ధాత్రి అని సునిశ్చితంగా విశ్వసించి, ఆ విశ్వాస ప్రాతిపదికనే జీవించి, మరణించిన మహాత్ముని గురించి సంఘీయులు బహిరంగంగా ఏమి చెప్పినప్పటికీ, ఆయనను గౌరవించే విషయంలో వారికి ఇప్పటికీ తీవ్ర అభ్యంతరాలు, ఆక్షేపణలు వున్నాయి.

– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో... ❑

**పత్రికా స్వేచ్ఛను గౌరవించడం అంటే**
**అవి కఠినమైన భాషలో వ్యాఖ్యానించినప్పటికీ**
**సహించగలగడం**

**ప్రజా నాయకులకు వారిచ్చే బహుమతులు**
**వారివి కావు.**
**వాటిని సమాజసేవకే వినియోగించాలి**


# గాంధీ ముస్లిం భాయ్... భాయ్



**సయ్యద్ నశీర్ అహ్మద్**
ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల పరిశోధకుడు

మహాత్మాగాంధీ జీవితంలో ముస్లింల ప్రమేయం ఎంత గాఢంగా పెనవేసుకుపోయిందో ఆయన జీవితం తరచి చూస్తే అర్థమవుతుంది. ముస్లింల సంపూర్ణ మద్దతు లేకపోయి ఉంటే వారిలోని మహా మహా నాయకులు గాంధీజీకి తోడుగా నడవకపోయి ఉంటే గాంధీజీ స్వాతంత్ర్యోద్యమం అసంపూర్ణంగా ఉండేదనే చెప్పాలి. గాంధీ-ముస్లింల జమిలీగా సాగింది.

అసలు గాంధీజీ దక్షిణాఫ్రికా వెళ్లడానికి ఒక సంపన్న ముస్లిం కారణం అని చాలామందికి తెలియక పోవచ్చు. దక్షిణాఫ్రికాలోని వ్యాపారి దాదా అబ్దుల్లా తన వ్యాపార లావాదేవీలలో స్థానిక న్యాయవాదులకు సహకరించాలని ఆహ్వానించడంతో 1892లో గాంధీజీ దక్షిణాఫ్రికా వెళ్లారు. అక్కడ భారతీయులు ఎదుర్కొంటున్న వివక్షను స్వయంగా అనుభవించిన గాంధీ దాదా అబ్దుల్లా ఆయన అనుచరుల వినతితో వివక్షకు వ్యతిరేకంగా పోరాటం ఆరంభించారు. దాదా అబ్దుల్లా గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలోనే 'నాటల్ ఇండియన్ కాంగ్రెస్' ఏర్పడింది. ఆ సంస్థ తొలి అధ్యక్షులుగా దాదా అబ్దుల్లా, కార్యదర్శిగా ఎం.కె.గాంధీ వ్యవహరించారు. 'ఆ కారణంగా ప్రజాసేవ చేయాలన్న తలంపు అక్కడే కలిగింది. అందుకు అక్కడే శక్తి చేకూరింది' అని స్వయంగా గాంధీజీ తన ఆత్మకథలో రాసుకున్నారు. 21 ఏళ్ల పాటు దక్షిణాఫ్రికాలో ఉన్నపుడు దాదా అబ్దుల్లా గాంధీకి అన్ని విధాలా తోడ్పాటు అందించడంతో 'దాదా అబ్దుల్లా ఆయనకు తండ్రిలా తోడ్పడ్డారు' అని చరిత్రకారులు అన్నారు.



1915లో గాంధీ భారత్ వచ్చేటప్పుడు అక్కడి గుర్రాల వ్యాపారి, సంపన్నుడైన అబ్దుల్ ఖాదిర్ కూడా ఆయనతో పాటు తన కుటుంబంతో వచ్చారు. సంపన్న జీవితాన్ని వదిలి గాంధీతో పాటుగా ఆశ్రమ జీవితం గడిపారు. సబర్మతీ ఆశ్రమంలో ముద్రణాలయం బాధ్యతలను నిర్వహించారు. గాంధీ ఈయనను 'ఇమాం సాబ్' అని పిలిచే వారు. ఖాదిర్ కుమార్తె అమనా ఖురేషి పెళ్లికి మహాత్మాగాంధీ వధువు బాబాయిగా తన పేరుతో ఆహ్వాన పత్రాలను వేయించి, సబర్మతీ ఆశ్రమంలో దగ్గరుండి పెళ్లి జరిపించారు.

మహాత్ముడు బిహార్ రాష్ట్రం చంపారన్‌కు రాకముందే ఈ పోరాటానికి పునాదులను నిర్మించిన రైతు నాయకులు షేక్ గులాబ్, పాత్రికేయుడు పీర్ ముహమ్మద్ మూనీస్ గాంధీ వెంట నడిచారు. నీలిమందు కర్మాగారాల ఆంగ్లేయ యజమానులు గాంధీ కార్యక్రమాలకు అంతరాయం కల్పించేందుకు ప్రయత్నించడమే కాకుండా ఆయనను అంతం చేయాలని సంకల్పించారు. దీన్ని బట్ట బయలు చేసి గాంధీ ప్రాణాలను బతఖ్ మియా అన్సారి అనే సాహసి కాపాడారు. ఈ విషయాన్ని భారత ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ 1950లో బహిర్గతం చేయడమే కాకుండా అన్సారికి భూమిని కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈనాటికీ ఆ ఆదేశాలు అమలుకు నోచుకోకపోవడం ఒక విషాదం.

గాంధీ రాజకీయ రంగప్రవేశం చేశాక జాతీయ స్థాయిలో పూనిన అతి పెద్ద ఉద్యమం ఖిలాఫత్ - సహాయ నిరాకరణ

**అస్పృశ్యత ఒక పాపం. నికృష్టమైన నేరం. దానిని నిర్మూలించకపోతే అది హిందూ మతాన్ని మింగేస్తుంది**

ఉద్యమం. ఇందులో ఆయనకు అలీ సోదరులుగా ఖ్యాతిగాంచిన మౌలానా మహమ్మద్ అలీ జౌహార్, మౌలానా షౌకత్ అలీ అండదండలు అందించారు. అలీ సోదరుల తల్లి అబాది బానో 70 ఏళ్ల వయసులో ఉద్యమ నిధులను సేకరిస్తున్న తీరు, జాతీయోద్యమంలోకి మహిళలను, పురుషులను ఆహ్వానిస్తూ చేస్తున్న ప్రసంగాలు గమనించిన బ్రిటిష్ ప్రభుత్వం ఆమెను ప్రమాదకర మహిళగా ప్రకటించింది. గాంధీతో పాటు ఇతర జాతీయోద్యమ కారులంతా 'అమ్మాజాన్', 'బీబీ అమ్మా' అంటూ ఆమెను గౌరవించేవారు. ఈ యోధురాలి కార్యదక్షతను, కార్యశీలతను మహాత్ముడు తన యంగ్ ఇండియాలో ప్రత్యేకంగా ఉటంకించారు. అలాగే జాతీయోద్యమం కోసం ఎంతో ఖర్చు చేసిన డాక్టర్ ముఖ్తార్ అహ్మద్ అన్సారి, షంషున్నీసా అన్సారి దంపతులపై గాంధీ ఎంతో వాత్సల్యం చూపారు.

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో 'సరిహద్దు గాంధీ'గా విఖ్యాతుడైన ఖాన్ అబ్దుల్ గఫార్ఖాన్ 1928లో తొలిసారి గాంధీని చూశారు. ఆయుధం ఆభరణంగా కలిగి వుంటూ, మిత్రునికి ప్రాణమివ్వడానికి, శత్రువు ప్రాణం తీయడానికి ఏమాత్రం సంకోచించని పఠాన్ జాతి నాయకుడైన గఫార్ఖాన్ మహాత్ముడి అహింసా సిద్ధాంతం పట్ల ఆకర్షితులయ్యారు. మహాత్ముడి కార్యాచరణను యథాతథంగా అమలుపర్చుతూ 'ఖుదా-యే-ఖిద్మత్గార్' (భగవత్సేవకులు) సంస్థను 1929లో స్థాపించాడు. భారత జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొనడం, భారత విభజనను అంగీకరించకపోవడంతో ఖాన్ అబ్దుల్ గఫార్ఖాన్ 30 ఏళ్ల పాటు జైలు జీవితం, ప్రవాస జీవితం గడపాల్సి వచ్చినా గాంధీ బాటను వీడక సంపూర్ణ గాంధేయవాదిగా జీవితాన్ని గడిపారు.

గాంధీజీకి పూర్తి తోడుగా నిలిచిన మరో మహనీయుడు జస్టిస్ అబ్బాస్ తయ్యాబ్జీ. భారత జాతీయ కాంగ్రెస్ ప్రారంభించకముందే 'గుజరాత్ రాజకీయ పరిషత్' ద్వారా సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిర్వహిస్తున్న తయ్యాబ్జీ మహాత్మాగాంధీ ప్రేరణతో 1919లో అన్ని విలాసాలకు స్వస్తి పలికి స్వదేశీ ఉద్యమంలో పూర్తి భాగస్వామి అయ్యారు. ఎనభై సంవత్సరాల వయసులో ఖద్దరును ప్రోత్సహించేందుకుగాను ఎద్దులబండిలో 'విముక్తి వస్త్రాన్ని' విక్రయిస్తూ గుజరాత్లోని గ్రామాల్లో తిరిగారు. 1930లో 12 మార్చి నుంచి ఏప్రిల్ 6 వరకు సాగిన దండియాత్ర సందర్భంగా బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని అరెస్టు చేసినపుడు ఆయన స్థానంలో యాత్రకు నాయకత్వం వహించిన వ్యక్తి అబ్బాస్. ఈయన గాంధీజీచే 'గుజారాత్ వజ్రం'గా ప్రశంసలందుకున్నారు.

గాంధీ దంపతుల పుత్రిక బీబీ అమతుస్సలాం మహాత్ముని అహింసా సిద్ధాంతం, కార్యచరణకు ఆకర్షితురాలై 1931లో అతి ప్రయాసతో సేవాగ్రాం చేరారు. గాంధీ పర్యటనల్లో ఆమే ఆయన వెంటుంటూ సేవలందించారు. గాంధీజీ జిన్నాకు లేఖ రాస్తున్న సందర్భంగా ఆయనను ఏ విధంగా సంబోధించాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతుండగా, అమతుస్సలాం 'ఖాయిదే ఆజం' అయితే బాగుంటుందని సూచించారు. ఆ విధంగా గాంధీజీ జిన్నాను సంబోధించడంతో 'ఖాయిదే ఆజం' పేరుతో జిన్నా పేరొందారు.

గాంధీకి సన్నిహితంగా మెలిగిన వారిలో అగ్రగణ్యుడు అబ్దుల్ కలాం ఆజాద్. 1920 జనవరిలో తొలిసారి గాంధీని కలుసుకున్న ఆజాద్ అప్పటి వరకు తాను అవలంబిస్తున్న విప్లవబాటను వీడి అహింసా మార్గాన ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. భారత విభజనను, వేర్పాటు వాదాన్ని వ్యతిరేకించారు. మహాత్ముని సహచరులుగా, అనుచరులుగా పురుషులతో పాటుగా చాలా మంది ముస్లిం మహిళలు జాతీయోద్యమంలో పాల్గొన్నారు. మహాత్ముని ఆదేశాలతో గుజరాత్లో గాంధేయ మార్గంలో సాగిన అన్ని పోరాట రూపాలకు సారథ్యం వహించిన మహిళ అమీనా తయాబ్జీ. గాంధీజీకి ఉర్దూ భాష నేర్పి ఆయనచే 'వస్తాద్ బీ' అని అనిపించుకున్న మహిళ రెహనా తయాబ్జీ. అసాధారణ దేశభక్తికి అపూర్వ చిహ్నంగా పేర్కొనబడిన సకీనా లుక్మాని పెద్ద వయసులోనూ గాంధీ మార్గాన్ని అనుసరిస్తూ మహాత్ముని ఆదేశాలను తు.చ తప్పకుండా పాటించారు.

స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల త్యాగాలు గాంధీజీకి సంపూర్ణంగా తెలుసు. హిందూ ముస్లింలు కలిసి ఈ దేశాన్ని ముందుకు నడిపించాలని ఆయన ఎంతగానో భావించారు. ❑

**నాకు సత్యమే దైవం. అహింసే ధర్మం.**
**సత్యాగ్రహమే ఆయుధం**



**ఓటు, సత్యాగ్రహం**
**ఈ రెండూ ప్రజల చేతిలోని ఆయుధాలు**

# కమ్యూనిస్టులకు బాపూ స్ఫూర్తి



**పుచ్చలపల్లి సుందరయ్య**

మహాత్మాగాంధీ పద్ధతులు, విధానాలతో విభేదించే కమ్యూనిస్టులూ ఆయన బోధనలతో ప్రభావితమయ్యారు. ఈ విషయాన్ని స్వయంగా ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య హైదరాబాద్‌లోని గాంధీ జ్ఞాన మందిరంలో చేసిన ప్రసంగంలో వెల్లడించారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు...

"గాంధేయ వాదానికి, కమ్యూనిజానికి మధ్య ఉత్తర, దక్షిణ ధృవాలకున్నంత దూరం ఉందని సామాన్య ప్రజలు భావిస్తారు. గాంధీజీ అహింసా విధానాన్ని అవలంభిస్తే కమ్యూనిజం హింసావాదాన్ని నమ్ముతుందని అనుకుంటారు. దేశ రాజకీయా ల్లోనూ గాంధీ రాజకీయాలకు... కమ్యూనిస్టు రాజకీయాలకు హస్తిమశకాంతరం ఉందని అంటారు. 1925-30 సంవత్సరాల మధ్య కాలంలో ప్రజాసేవ చేయాలన్న ఉత్సాహం నాలో కలిగిందంటే అది కేవలం గాంధీజీ రచనలు, వ్యాసాలు చదవడం వల్లే. అలా చెప్పుకోవడానికి నేను గర్విస్తాను కూడా. కమ్యూనిస్టు పార్టీలోనూ చాలా మంది ఆయన రచనలను చదవడం వల్లే ఉత్తేజితులయ్యారు. ఆ అయిదేళ్ళలో ఖద్దరు, అస్పృశ్యత నివారణ, హిందూ-ముస్లిం ఐక్యత, స్వదేశీ ఉద్యమం, సత్యాగ్రహం, మద్యపాన నిషేధం.. ఇలా దాదాపుగా ఆయన రచనలన్నీ చదివాను.

కానీ, 1930 తర్వాత కొన్ని అనుమానాలు మొదలయ్యాయి. ఆయన విధానాలతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా... కార్మిక, కర్షక, మధ్య తరగతి ప్రజల ప్రభుత్వం వస్తుందా లేదా నూటికి పది మందే ఉండే పెట్టుబడిదారులు, భూస్వాముల ప్రభుత్వం వస్తుందా అన్న అనుమానం వచ్చింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు లేదా భారత పెట్టుబడిదారులతో రాజీ పడితేనే స్వాతంత్ర్యం వస్తుందేమోనని కూడా అనుకునే వాడిని. అయినా ఆయన వ్యాసాలను శ్రద్ధగా చదువుతూనే ఉండేవాడిని.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నూరేళ్ల పాటు సాగిన పోరాటంలో అందరికన్నా అగ్రగణ్యులు గాంధీజీయే. ఆయన కంటే ముందు దాదాబాయ్ నౌరోజీ, గోపాలకృష్ణ గోఖలే, రనడే, బాల గంగాధర తిలక్ లాంటి పలువురు కాంగ్రెస్‌కు పునాదులు వేశారు. కానీ వాళ్లందరికన్నా గాంధీజీ తలమానికంగా ఉండేవారు. సామాన్య ప్రజల్లోనూ చైతన్యం రగిలించి వారందరూ పాల్గొనేందుకు వీలయ్యే ఒక కార్యక్రమం రూపొందించి వారిని ముందుకు నడిపించడంలోనే గాంధీజీ గొప్పతనం ఉంది. స్వాతంత్ర్యం సంపాదించడానికి గాంధీయిజం పునాదులు వేసింది. స్వాతంత్ర్యం అనే మన ఆశయాన్ని సాధించడంలో గాంధీజీ ప్రముఖ పాత్రను కమ్యూనిస్టులు గుర్తిస్తారు. కానీ, అంతకు మించి ముందుకు పోవడానికి ఆయన సిద్ధాంతాలు తోడ్పడవు. కమ్యూనిస్టులు నిరాడంబర జీవనానికి వ్యతిరేకులని చాలా మంది అభిప్రాయం. గాంధీజీ లాగ నిరాడంబరంగా ప్రతి పార్టీ కార్యకర్త నిరాడంబర జీవనం గడపాలి. అలా చేయకపోతే ప్రజలతో సజీవ సంబంధాలు పెట్టుకోలేం.


దేశానికి గాంధీ ఏమీ చేయలేరని... ఆయన ప్రవచనాల నుంచి నేర్చుకుని ఆచరించేది ఏమీ లేదని మేము అనుకోవడం లేదు. గాంధీజీ కేవలం ధనిక వర్గాల కోసమే పని చేశారని గతంలో మేం బండగా చెబుతూ వచ్చాం. అది తప్పు. ఆయన పెట్టిన పరిమితుల వల్ల, అవలంభించిన కొన్ని పద్ధతుల వల్ల ఆయన అనుకున్నా... అనుకోకపోయినా ధనిక వర్గాల ప్రాబల్యం, పెత్తనం అలాగే ఉండిపోయాయి. గాంధీ సిద్ధాంతాల్లో సమానత్వం కీలకం. దక్షిణాఫ్రికాలో తెల్లవారితో నీగ్రోలకు సమానత్వం, చంపారన్‌లో రైతుల సమానత్వం, విదేశాలలో భారతదేశం సమానత్వం, అన్ని కులాల వారి సమానత్వం, హిందూ-ముస్లిం సమానత్వం కోసం ఆయన జీవితమంతా పోరాడారు. ఈ సమానత్వం సాధించాలనే కర్తవ్యం ఇంకా మిగిలి ఉంది. దాన్ని సాధించాలి. అలా చేస్తేనే గాంధీజీ ఆశయాలను నెరవేర్చిన వాళ్ళమవుతాము.

పూర్తి సమానత్వం సాధించలేకపోయినా కనీసం హెచ్చుతగ్గులైనా సాధ్యమైనంత వరకు తగ్గించాలి.

గాంధీజీ శాంతి కావాలన్నారు. ప్రపంచంలో కొన్ని దేశాలు.. ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ లాంటివి యుద్ధాన్ని రెచ్చగొడు తున్నాయి. వారిని వ్యతిరేకించి ప్రపంచశాంతిని కాపాడటానికి కృషిచేయడం, హిందూ-ముస్లిం ఐక్యత, కులతత్వాలను తొలగించడం కూడా గాంధీజీ ఆశయాల అమలుకు చేసే కృషే. ఇలా చేస్తేనే ప్రజల సౌభాగ్యం, దేశ సౌభాగ్యం సాధ్యమవుతాయి.

చైనాలో సన్యట్సేన్ను కమ్యూనిస్టు పార్టీ గౌరవిస్తుంది. ఆయన అభిప్రాయాలన్నింటితో కమ్యూనిస్టు పార్టీ ఏకీభవించకపోయినా, దేశాభివృద్ధికి ఆయన ఒకానొక దశలో చాలా కృషి చేశారు. ఎన్ని లోపాలు, పరిమితులున్నా అలాంటివారిని గౌరవించి, వాళ్ల ఆశయాలను ముందుకు తీసుకుపోవడం సత్సంప్రదాయం. అలాగే మహాత్మాగాంధీని, ఆయన సేవను గుర్తించి.. గౌరవించాలి. ❑

# సత్యాగ్రహం



**- పెద్దిభొట్ల సుబ్బరామయ్య**



అది నాలుగు రోడ్ల కూడలిలో నున్న పెద్ద హోటలు. ఉదయం ఎనిమిది గంటలు దాటింది. వచ్చేపొయ్యే వారి హడావిడి జాస్తిగా వుంది. కౌంటరు దగ్గర ఒక బట్టతల వ్యక్తి కూర్చుని బిల్లులు వసూలు చేస్తున్నాడు. వేగంగా తిరుగుతున్న టేబుల్ ఫ్యాను పక్కగా కూర్చున్నప్పటికీ ఆ వ్యక్తి నుదుట స్వేదబిందువులు జారుతున్నాయి. కౌంటరు దగ్గర రద్దీ విపరీతంగా వుంది.

ఇన్‌స్పెక్టరు పార్థసారథి కౌంటరుకు దగ్గర్లో ఉన్న ఒక కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతున్నాడు. అతని చూపులన్నీ కౌంటరు దగ్గర కూర్చున్న బట్టతల వ్యక్తి మీదనే ఉన్నాయి. బిల్లులు చూస్తూ, చిల్లర యిస్తూ, తల ఎత్తకుండా యంత్రంలా పని చేస్తున్న ఆ వ్యక్తిని చూస్తుంటే అతనికి నవ్వు వస్తోంది. 'డబ్బు వసూలు చేసుకోవటం కూడా కష్టమైన పనే' అని అతనికి తోచింది.

ఇంతలో హోటల్లోకి వచ్చిన యిద్దరు పిల్లల మీద అతని దృష్టి పడింది. వారిద్దరూ అక్కా తమ్ముళ్ళలా వున్నారు. ఆడపిల్లకు ఎనిమిదేళ్లు వుంటాయి. ఆ పిల్ల వెంట వున్న చిన్నపిల్లవాడికి అయిదేళ్ళు వుంటాయి. ఇద్దరూ, మంచివి కాకపోయినా, శుభ్రమైన దుస్తులు వేసుకుని వున్నారు.

ఆ పిల్ల కౌంటరు దగ్గరికి వెళ్ళి 'మా నాన్నగారు నాలుగు యిడ్లీలు తెమ్మన్నారు' అని చెప్పింది. బట్టతలవాడు బల్ల మీదవున్న 'కాలింగ్ బెల్' నొక్కి; 'సార్' అంటూ వచ్చిన వెయిటర్‌తో 'నాలుగు యిడ్లీ పార్శెల్' అని చెప్పి మళ్ళీ తన పనిలో మునిగి పోయాడు. ఆ పిల్లలిద్దరూ అలాగే కౌంటరు పక్కనే నిలబడి వున్నారు.

పార్థసారథి కాఫీ తాగటం ముగించాడు. ఆ పిల్లలు అడిగిన పార్శిల్ వొచ్చింది. ఆ పిల్ల పొట్లం అందుకుని కౌంటరు మీదికి చెయ్యి జాపింది. బట్టతలవాడు, 'ఏమిటి?' అని అడిగాడు. ఆ పిల్ల తడుముకోకుండా 'ఇందాక అయిదు రూపాయల నోటు యిచ్చాను. మిగిలిన చిల్లర యివ్వలేదు' అన్నది.

పార్థసారథి నివ్వెరపోయాడు. ఆ బట్టతల వ్యక్తి మొహం మీద స్వేద బిందువులను పై పంచెతో తుడుచుకుంటూ, సందేహంగా 'అయిదు రూపాయల నోటిచ్చావా?' అంటూ సొరుగు లాగి నాలుగు రూపాయి నోట్లూ, మూడు పావులా బిళ్ళలూ తీసి బల్ల మీద పడేసి మరో బిల్లు అందుకున్నాడు. ఆ పిల్ల నోట్లూ చిల్లరా చేతిలోకి తీసుకుని తమ్ముడి చెయ్యి మరో చేత్తో పట్టుకుని బయలు దేరింది.

పార్థసారథి యింతసేపూ ఆశ్చర్యంతో చూస్తూ వుండి పోయాడు. ఆ పిల్లలిద్దరూ మెట్లు దిగి వీధిలోకి పోగానే అతడు కృత నిశ్చయుడై లేచి బిల్లు చెల్లించి వీధిలోకి వచ్చాడు. ఆ పిల్లలిద్దరూ అప్పుడప్పుడు వెనక్కు తిరిగి చూస్తూ కుడి వైపు నడిచి మలుపు తిరుగుతున్నారు. పార్థసారథి నెమ్మదిగా వారు గమనించకుండా వారి వెంటనే నడవటం ప్రారంభించాడు.

మూడు నాళ్ళ క్రిందట పట్టిన ముసురు ఆనాడు తెల్లవారుజామునే వెలిసింది. జలార్ద్రమైన నల్లని మేఘాలు యింకా కమ్ముకుని వొస్తున్నాయి. వీధులన్నీ జలమయమై బురదతో నిండి వున్నాయి. ఇద్దరు ముగ్గురు కుర్రవాళ్ళు 'పేవ్‌మెంటు' మీద నిలబడి దినపత్రికలమ్ముకుంటున్నారు. ఒక కారు వీధిలో నిలిచి వున్న బురద నీళ్ళను, కాలి నడకను పోతున్న వారి మొహాల మీదచల్లి హడావిడిగా పరుగెత్తిపోయింది.

పార్థసారథి చూపులన్నీ ఆ పిల్లల మీదే వున్నాయి. వారిద్దరూ త్వరత్వరగా నడిచి ఎన్నో మలుపులు తిరిగి ఒక వీధిలో ఒక యింట్లో ప్రవేశించారు. ఆ వీధి అంతా బురద నీళ్ళతో నిండి చాలా అసహ్యంగా వుంది. అది వొక చిన్న పెంకుటిల్లు. ఇంటి ముందంతా కాలు పెట్టేటందుకు వీలు లేకుండా వాననీళ్ళు నిలిచి వున్నాయి. ఆ నీళ్ళలో నాలుగైదు యిటికరాళ్ళు వేసి నడిచేందుకు వీలు చేసుకున్నారు. ఇంటి ముందు కొద్దిగా ఖాళీ స్థలం వుంది. పై కప్పు కుంగిపోయి కూలిపోయేందుకు సిద్ధంగా వుంది. వాకిట వున్న ఖాళీ స్థలంలో ఒక మందార చెట్టు తప్ప మరేమీ లేదు.

**ఆచరించడం కష్టమని మూల సూత్రాలను విస్మరించకూడదు**

అది కూడా అందరూ తనను నిరాదరించినందువల్ల కాబోలు ఏపుగా పెరగలేదు.

పార్థసారథి ఒకటి రెండు నిమిషాలు అలాగే వీధి మధ్యలో ఏం చెయ్యాలో తోచక నిలుచుండిపోయాడు.

ఇంతలో ఆ యింట్లో నుండి ముందు పెద్దగా నవ్వు వినిపించింది. తరువాత ఒక వ్యక్తి పంచలోకి వొచ్చాడు. అతడు నల్లగా వున్నాడు. కొద్దిగా మాసిన ఒక ధోవతి కట్టుకుని బనియను వేసుకుని వున్నాడు. గడ్డం ఒత్తుగా పెరిగి వుంది. అతడు పార్థసారథి వంక రెండు క్షణాలు రెప్ప వాల్చకుండా చూసి 'ఎవరి కోసమండీ?' అని అడిగాడు.

పార్థసారథికి ఏం జవాబు చెప్పాలో తోచలేదు. అతడు నవ్వుతూ సమయస్ఫూర్తితో 'ఈ వీధిలో నా స్నేహితుడొకడు వుండాలి. అతనిలో పని వుండి వెతుకుతున్నాను. మీరీ యింట్లోకి కొత్తగా వచ్చారా?' అని అన్నాడు. ఆ వ్యక్తి జుట్టు పైకి సర్దుకుంటూ "అవునండీ. మేమి యింట్లోకి వచ్చి వారం రోజులే అయింది. ఇంతకు పూర్వం యీ యింట్లో వున్న అతనికి బోదకాలు, బ్రహ్మచెముడు. అతనేనా మీ స్నేహితుడు?" అని ప్రశ్నించాడు. పార్థసారథి తలవూపి "నాకెక్కడా యిల్లు దొరక్క బాధపడుతూ వుంటే, తను యిల్లు ఖాళీ చేసి పోతున్నాననీ, యీ యింట్లో చేరవచ్చుననీ చెప్పాడు. ఇప్పుడేం చెయ్యగలం? అంతా మించిపోయింది. ఇంతకీ మీకీ యిల్లు వసతిగా వుందా?" అని అడిగాడు. 'అలా వీధిలోనే నిలబడి మాట్లాడుతున్నారే. లోపలికి రండి' అంటూ ఆ వ్యక్తి ఒక చాప తెచ్చి పంచలో వేసి కూర్చున్న తర్వాత తను కూడా కూర్చుంటూ "ఆc! ఏం వసతిలెండి. నూతినీళ్లు తాగలేక బాధపడిపోతున్నాం. వర్షానికి ఒకటే కురవటం. యిల్లంతా 'చితచిత' లాడుతున్నది'' అంటూ చప్పరించాడు. "మీరేం చేస్తున్నారు? అని పార్థసారథి అడిగిన ప్రశ్నకు "ఇక్కడే ఒక ప్రెస్సులో పని చేస్తున్నానండీ' అని సమాధానం చెప్పాడు.

అదే సమయంలో లోపలి నుంచి ఆ పిల్లలిద్దరూ పంచలోకి వచ్చారు. కాకీ డ్రస్సులో వున్న పార్థసారథిని చూసి, బిక్కు బిక్కు మంటూ వాళ్లిద్దరూ గుమ్మంలో నిలుచున్నారు. పార్థసారథి ఆ వ్యక్తిని "మీ పిల్లలా?" అని అడిగాడు. ఆ వ్యక్తి తలవూపి "అవునండీ" అన్నాడు.

పార్థసారథి ఒక్క క్షణం వూరుకుని తర్వాత గంభీరంగా "మీరు అన్యథా భావించనంటే మీతో ఒక విషయం చెప్పదలచుకున్నాను" అన్నాడు. ఆ వ్యక్తి కొద్దిగా ఆశ్చర్యపోయి "అదేమిటి? మీరు నాతో పని వుండే వచ్చారా? మీరు చెప్పదలచుకున్నదేదో సూటిగా చెప్పండి" అన్నాడు.

పార్థసారథి నెమ్మదిగా జరిగిన విషయం అంతా చెప్పాడు. అతడు మాట్లాడుతున్నంత సేపూ ఆ పిల్లలిద్దరూ గుమ్మం వెనక నుంచునే వున్నారు. ముందు గదిలో కిటికీ పక్కన యిరవై అయిదేళ్ళ యువతి ఒకామె, ఆ పిల్లల తల్లి కాబోలు, వింటూ నిలబడి వుంది.

అంతా విన్న తర్వాత ఆ వ్యక్తి కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. అతడు పెద్దగా కేకవేసి పిల్లలను పిలిచాడు. వాళ్లిద్దరూ సింహం ముందుకు వచ్చే లేగదూడల వలె పంచలోకి వాచ్చరు. అతడా పిల్లను జుట్టు పట్టుకుని "నేనిచ్చిన అయిదు రూపాయల నోటు ఎక్కడ పారేశావు?' పారెయ్యటమే గాక హోటలు వాళ్ళను మోసం చేస్తావా? నాకు తలవంపులు తెస్తున్నావు. చావు" అంటూ బాదటం ప్రారంభించాడు. ఆ పిల్ల వెక్కి వెక్కి ఏడుస్తోంది. 'తర్వాత తనను కూడా కొడతాడేమో'నని భయంతో చిన్నపిల్లవాడు 'కెవ్వుమ'ని ముందే ఏడవటం సాగించాడు.

పార్థసారథి వెంటనే కలుగజేసుకుని ఆ పిల్లను విడదీసి సముదాయించి లోపలికి పంపించి "పిల్లను చావబాదమని నేను చెప్పలేదు. కొట్టి వాళ్ళను సంస్కరించలేము. మనం తగిన కట్టుదిట్టాలు చేసుకోవాలి. మీకీ విషయం చెప్పి చాలా మనస్తాపం కలిగించినట్టున్నాను. అయినా పిల్లల మంచి కోరి మాత్రమే మీకీ విషయం చెప్పాను" అన్నాడు. ఆ వ్యక్తి ఏమీ సమాధానం చెప్పలేదు.

తరువాత కొన్ని క్షణాలు యిద్దరూ నిశ్శబ్దంగా వున్నారు. పార్థసారథికి ముళ్ల మీద కూర్చున్నట్టుగా వుంది. అతడు లేచి "నేను వెళ్ళివస్తానండీ" అన్నాడు. ఆ వ్యక్తి ఏమీ సమాధానం చెప్పకుండా తలవూపి వూరుకున్నాడు. పార్థసారథి నెమ్మదిగా నడిచి వీధిలోకి వచ్చాడు.

సాయంకాలం అయిదుగంటలయి వుంటుంది. వీధులన్నీ ఆఫీసుల నుంచి వచ్చే జనంతో, సినిమాలకు పోయే జనంతో నిండి కిటకిటలాడుతున్నాయి. అప్పుడే అచ్చయి వచ్చిన దినపత్రికను యిద్దరు ముగ్గురు కుర్రవాళ్ళు కేకలు వేస్తూ అమ్ముతున్నారు. పార్థసారథి పార్కు పక్కనే పేవ్‌మెంటు మీద నడుస్తున్నాడు. వారం రోజుల నుంచి వర్షం లేకపోవడం వల్ల రోడ్లు కాస్త మెరుగ్గా వున్నాయి. ఆకాశం నిర్మలంగా వుంది. చల్లని గాలి ఆహ్లాదకరంగా వీస్తోంది. పేవ్‌మెంటు మీద అంతవరకూ 'మూడు ముక్కలాట' ఆడుతున్న వారిద్దరు ముగ్గురు, పార్థసారథిని చూడగానే పేకముక్కలు దాచేసి ఏవో కబుర్లాడుకుంటున్న వారిలా నటించారు.

పార్థసారథి ఆగిపోయాడు. పార్కులో పిల్లలు రకరకాల ఆటలు ఆడుకుంటున్నారు. ఆ పార్కులో పిల్లల కాలక్షేపానికి

అవసరమైన సాధనాలు చాలా వున్నాయి. చాలా మంది పిల్లలు కేకలు వేస్తూ, పరుగెలెత్తుతూ ఆడుకుంటున్నారు. ఆ పక్కనే సిమెంటు బల్ల మీద కూర్చుని వున్న యిద్దరు పిల్లల మీద పార్థసారధి దృష్టి నిలిచిపోయింది. వాళ్లిద్దరూ అతనికి బాగా జ్ఞాపకం వున్నారు.

అతడు నెమ్మదిగా నడిచి పార్కులోకి వెళ్ళాడు. 'డ్రస్సు'లో వచ్చిన పార్థసారధిని చూసి కొంత మంది చిన్నపిల్లలు గోల చెయ్యడం తగ్గించి నెమ్మదిగా ఆడుకోవడం ప్రారంభించారు. ఒకనాగుగేళ్ల కుర్రవాడు చక్రాల వంటి కళ్లను మరింత పెద్దవిగా చేసి రెప్ప వెయ్యకుండా అతని వంక చూశాడు.

ఆ పిల్ల పార్థసారధిని చూసి నవ్వింది. అతడు కూడా నవ్వుతూ, వారి పక్కనే సిమెంటు బల్ల మీద కూర్చుంటూ "నేను గుర్తున్నానా?" అన్నాడు. ఆ పిల్ల బదులు చెప్పకుండా మళ్ళీ నవ్వింది. ఆ పిల్లవాడు కళ్లు పెద్దవిగా చేసి పార్థసారధి వంక చూస్తున్నాడు.

పార్థసారధి కాస్సేపాగి 'నువ్వెన్నో క్లాసు చదువుతున్నావు?' అని అడిగాడు. ఆ పిల్ల నుదుట పడుతున్న జుట్టు వెనక్కు సర్దుకుంటూ 'అయిదు' అని సమాధానం చెప్పింది. ఆ కుర్రవాడు చూపుడు వేలు చూపిస్తూ 'నేను ఒకటి' అన్నాడు. పార్థసారధికి నవ్వాగలేదు. 'అబ్బో! అయితే నువ్వు పెద్దక్లాసే చదువు తున్నావన్నమాట' అన్నాడు.

తరువాతి కాస్సేపు నిశ్శబ్దంగా కూర్చుని దూరంగా ఆడుతున్న పిల్లల వంక చూసి "మీరిద్దరూ ఆడుకోవటం లేదెందుకనీ?" అని ప్రశ్నిఛీచాడు. ఆ పిల్ల తమ్ముణ్ణి దగ్గరికి తీసుకుని "వీడికి నాలుగు రోజుల నుంచి జ్వరం ఇవ్వాళే తగ్గింది" అని బదులు చెప్పింది.

"మీ నాన్నగారు ఏ ప్రెస్సులో పని చేస్తున్నారు?" అని అడిగాడు పార్థసారధి. ఆ ప్రశ్న విని ఆ పిల్ల ఆశ్చర్యంగా కళ్లు పెద్దవి చేసి చూస్తూ "మా నాన్న ఎప్పుడూ యింట్లోనే వుంటాడు. ఏ పని చెయ్యటం లేదు" అని చెప్పింది. పార్థసారధి నివ్వెరపోయి "ఆనాడు ఏదో ప్రెసుసలో పని చేస్తున్నానని చెప్పారుగా!" అన్నాడు.

ఆ అమ్మాయి ఉదాసీనంగా "మా నాన్న ఏ పనీ చెయ్యడు. మునుపొక చోట ఉద్యోగం చేశాడు. కానీ డబ్బు కాజేశాడని వాళ్లు పనిలోకి రావొద్దన్నారు. తర్వాత కొన్నాళ్లు పొద్దునపోయి రాత్రికి యింటికి వొచ్చేవాడు. పేకాట ఆడేవాడని అమ్మ చెప్పింది. ఇంట్లో అమ్మను డబ్బు కోసం వేధించి లేదంటే కొడుతూ వుంటాడు. అప్పుడప్పుడు రాత్రి పొద్దుపోయిన తర్వాత తూలుతూ యింటికి వస్తాడు. అప్పుడాయన కళ్లు ఎర్రగా వుంటాయి. ఏదో వాసన వేస్తూ వుంటుంది. దగ్గరికి పోవడానికే భయం పుడుతుంది. అయినా అమ్మ మాత్రం కాళ్లు కడిగి అన్నం కలిపి పెట్టి తినిపిస్తూ వుంటుంది. ఇవాళ పొద్దున్నే ఇల్లుగలావిడతో దెబ్బలాడి ఆమెను బండబూతులు తిడితే నలుగురూ చేరి కొట్టబోయినారు" అని చెప్పింది.

పార్థసారధి నిశ్చలంగా అంతా విన్నాడు. అతనికి చాలా మనస్తాపం కలిగింది. విషయం మారుద్దామని "ఆనాడు నువ్వా హోటలు వాణ్ణి మోసం చేశావు. తప్పు కదూ? ఆ డబ్బు వాడిది కాదు కదా. ఎవరో జీతం యిస్తే ఆ పని చేస్తున్నాడు. నువ్వలా చెయ్యటం వల్ల వాడి జీతంలో అయిదు రూపాయలు తెగ్గోసి వేస్తారు. వాడెంత బాధపడతాడు? ఇంతకీ ఆనాడు నువ్వా అయిదు రూపాయల నోటు ఎక్కడ పారేశావు? అని అడిగాడు.

ఆ పిల్ల ఆశ్చర్యంగా చూస్తూ "ఏ నోటు?" అన్నది. పార్థసారధి "మీ నాన్నగారు నీ చేతికిచ్చానన్నారుగా?" అన్నాడు. ఆ పిల్ల నవ్వుతూ "మీరు భలేవారేనే. మా నాన్న నాకానాడు ఏ నోటూ యివ్వలేదు. ఆయనే అమ్మ వొద్దంటున్న కొద్ది వినక మాకు అలా చెయ్యమని చెప్పి పంపించాడు" అన్నది.

పార్థసారధి తల తిరిగినట్లయింది. అతడు చాలా అందంగా మోసపోయాడు. కాస్సేపు కళ్ళు తేలవేసి నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

'నమస్కారం సార్' అంటూ ఒక పదేళ్ల కుర్రవాడు, చేతిలో దినపత్రికల దొంతరతో అక్కడికి వచ్చాడు. పార్థసారధి అతన్ని చూసి నవ్వి "ఏమోయ్! నువ్వు కనబడి చాలా రోజులయిందే. రిజల్ట్సు పడ్డనాడు ఫోర్తు ఫారం పాసయ్యానని చెప్పటానికి మా యింటికి వొచ్చావు. అప్పటి నుంచీ కనిపించనే లేదు. బాగా చదువుకుంటున్నావా?" అని అడిగాడు. ఆ కుర్రవాడు వినయంగా "బాగానే చదువుకుంటున్నానండీ, మీ దయ వల్ల యీ యేడు స్కూల్లో స్కాలర్‌షిప్ కూడా వచ్చిందండి. అన్నట్టు కొత్త పుస్తకాలు కొనుక్కోమని మీ యింటికి వచ్చినప్పుడు అమ్మగారు నాకు పది రూపాయలిచ్చారండి. మీకు చెప్పవద్దని చెప్పారండి" అన్నాడు. ఇంతలో "ఒక పేపరిలా యివ్వవోయ్" అని ఎవరో పిలవడం వల్ల అతడు "వస్తానండి" అంటూ వెళ్ళిపోయాడు.

పార్థసారధి ఆర్ద్రమైన కళ్ళతో ఆ పిల్లనుద్దేశించి "చూశావా? ఈ కురర్రాడికి తండ్రి చిన్నప్పుడే పోయాడు. తల్లి ధనవంతుల యిళ్ళలో పనిచేసి వీణ్ణి పెంచింది. పగలు బడికి పోయి శ్రద్ధగా చదువుకుని సాయంకాలం పూట పేపర్లమ్ముతూ వుంటాడు. పేపరు ఏజెంటుతో చెప్పి నేనే రెండేళ్ళ క్రిందట యీ పని యిప్పించాను. ప్రతి సంవత్సరము ఫస్టు మార్కులు తెచ్చుకుని పాసవుతున్నాడు. మరో రెండేళ్ళలో స్కూల్ ఫైనలు పాసయిపోతాడు. ఇలాగే బుద్ధిమంతుడుగా వుంటే కాలేజీలో కూడా చేరి పెద్ద పెద్ద చదువులు చదివి వృద్ధిలోకి వస్తాడు. పెద్ద ఉద్యోగం సంపాదించి తల్లిని

సుఖపెడతాడు. అందరూ అతన్ని గౌరవిస్తారు" అన్నాడు. అతని గొంతు గద్గదికమయింది. అతడు మళ్ళీ కాస్సేపాగి నువ్వు మొన్న ఆ హోటలు వాణ్ణి మోసం చేశావు. అది తప్పని నీకు తెలుసు కదా. తప్పు చెయ్యడం తేలిక. కాని ఎప్పుడో ఒకప్పుడు పట్టుబడక తప్పదు. తప్పు చెయ్యటం బాగానే వుంటుంది. అందులో ఏదో ఆకర్షణ వుంటుంది. కాని అది మనల్ని స్వేచ్ఛగా అందరిలో తిరగనివ్వదు. నువ్వు మళ్ళీ ఆ హోటలుకు పోగలవా? పోలేవు. ఆ హోటల్ని, ఆ బట్టతల వాణ్ణి తప్పించుకు తిరుగుతావు. ఆ వీధిలో నడవటమే నీకు కష్టం. వాడి మొహం వంక నేను చూసినట్టు ధైర్యంగా నువ్వు చూడలేవు. ఎవర్ని చూసినా లోపల నీకు బెరుగ్గా వుంటుంది. ఆ కుర్రాడిలా నలుగురిలో తలెత్తుకుని తిరగగలవా? ఆలోచించుకో" అన్నాడు.

ఆ పిల్ల పైకి చూస్తూ ఆలోచిస్తూ వుండిపోయింది. ఆకాశంలో దట్టమైన మేఘాలు కదులుతున్నాయి. పక్షులు పల్టీలు కొడుతూ రొద చేస్తూ ఎగిరిపోతున్నాయి. పార్థసారథి నిర్మలంగా వున్న ఆ పిల్ల మొహంలోకి చూస్తూ "మీ నాన్న చాలా మోసగాడిలా వున్నాడు. అన్నీ అబద్ధాలే చెప్పాడు. మీ నాన్నను అంత సోమరిగా వుండనివ్వకూడదు. ఆయన చేత ఏదో పని చేయించాలి. పని లేకనే ఆయన అలా తయారైనట్టున్నాడు. ఈ ఊళ్ళో మా బావగారికి ఒక పుస్తకాల షాపు వుంది. అందులో ఒక గుమాస్తా కావాలి. ఊరికే కూర్చోటమే పని. ఎవరైనా వచ్చి "ఫలానా పుస్తకం వున్నదా?" అని అడిగితే వుంటే తీసి యివ్వటం, లేకపోతే లేదని చెప్పటం. ఈ పని కష్టమైనది కాదుగా. నెలకు ఎనభై రూపాయల దాకా ఇప్పిస్తాను. మీ నాన్నతో చెప్పు వినకపోతాడా! గాంధీ గారు చేసిన పని తెలుసుగా. అన్నం నీళ్ళు మానెయ్యి. ఒక్క పూట సత్యాగ్రహం చేస్తే ఆయనే దోవకు వస్తాడు. మీ అమ్మగారికి కూడా చెప్పు. ఆయన మొండికెత్తితే అందరూ కలిపి సత్యాగ్రహం చెయ్యండి. ఆయనతో ఎవ్వరూ మాట్లాడకండి. ఈ బుల్లి బాబును కూడా ఆయన దగ్గరికి పోకుండా చెయ్యండి. అప్పటికి తల తిరిగి దోవలోకి వస్తాడు. నా దగ్గరికి రమ్మనండి. నేను పక్క వీధిలోనే పోలీసు స్టేషన్లో వుంటాను. పార్థసారథి అంటే ఎవరైనా చెబుతారు" అన్నాడు.

ఆ పిల్ల ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా ఆకాశంలోకి చూస్తున్నది. మబ్బులు కమ్ముకుని వొచ్చాయి. చల్లనిగాలి వీస్తోంది. పార్కులో అంతవరకూ ఆడుకుంటున్న పిల్లలందరూ ఇళ్ళకు తిరిగిపోతున్నారు.

పార్థసారథి లేచి "వర్షం వొచ్చేట్టుంది. ఇంక ఇంటికి పొండి" అని ఆ చిన్నపిల్లవాణ్ణి సిమెంటు బల్ల మీద నుంచి కిందికి దింపాడు. ఆ పిల్ల కిందికి దిగి తమ్ముడి చెయ్యి పట్టుకుని రెండు మూడడుగులు వేసింది. పార్థసారథి "నేను చెప్పిన విషయం మర్చిపోవు గదా?" అన్నాడు. ఆ పిల్ల వెనక్కు తిరిగి చూసి తల వూపి మళ్ళీ ముందుకు నడిచింది. వాళ్లిద్దరూ పార్కుగేటు దాటిపోయే వరకూ చూసి పార్థసారథి తను కూడా బయటికి నడిచాడు.

మళ్ళీ సోమవారం నాడు పార్థసారథి స్టేషన్లో కూర్చుని పని చూసుకుంటూ వుండగా గోడనున్న గడియారం అయిదు గంటలు కొట్టింది. వెంటనే ఫైళ్ళన్నీ సర్దేసి బయటికి వద్దామనుకుంటూ వుండగా కానిస్టేబుల్ వచ్చి "ఎవరో మిమ్మల్ని చూడాలంటున్నా రండీ" అని చెప్పాడు.


పార్థసారథి చిరాకుతో "లోపలికి వేంచేయమను" అంటూ కుర్చీలో కూలబడ్డాడు. గుమ్మంలో కనిపించిన వ్యక్తిని చూసేసరికి అతని చిరాకు మాయమైంది. అతడు చిరునవ్వు నవ్వుతూ "రండి, కూర్చోండి" అని ఆహ్వానించాడు.

ఆ వ్యక్తి చాలా చిక్కిపోయినట్టు కనుపిస్తున్నాడు. శుభ్రమైన ధోవతి కట్టుకుని వున్నాడు. భుజం మీద కొద్దిగా చిరిగిన చొక్కా తొడుక్కుని వున్నాడు. అతడు పార్థసారథితో నెమ్మదిగా "నేను మిమ్మల్ని అనవసరంగా మోసం చేశాను. క్షమించండి. ఈ వారం రోజుల నుంచి యింట్లో అందరూ నన్ను నిరాదరిస్తున్నారు. నా భార్య మాట్లాడటం మానేసింది. పిల్లలిద్దరూ నా పరిసరాల్లోకే రావటం మానేశారు. సమయానికింత తిండి పడెయ్యటం తప్ప ఎవరూ కన్నెత్తి కూడా చూడటం లేదు. నాకు పిచ్చెత్తుతున్నట్టుగా వుంది. మా బుచ్చి బాబు – నాలుగేళ్ల వెధవ – వాడు కూడా నన్ను చూసి తప్పించుకు తిరుగుతున్నాడు. ఆ పిల్ల పొద్దుటి నుంచి అన్నం నీళ్లు లేకుండా పడి వుంది. నేను మిమ్మల్ని కలుసుకుంటేనే గాని అది అన్నం తినదని నా భార్య చెప్పింది" అన్నాడు. అతని కళ్లలో నీళ్లు తిరిగినయ్. చాటుగా మొహం తిప్పుకుని పై పంచెతో కళ్లద్దుకున్నాడు. అతడు మళ్లీ కాసేపాగి "మిమ్మల్ని కలుసుకుంటాననే సరికి ఆ పిల్ల ఉత్సాహంగా లేచి మధ్యాహ్నం నాకీ ధోవతీ చొక్కా ఉతికి పెట్టింది" అన్నాడు.

పార్థసారథి చలించిపోయాడు. అతనికి పరమానందమైంది. అతడు వెంటనే లేచి "రండి, యిప్పుడే మా బావగారి షాపుకు పోదాం. ఆయనతో నేనింతకు ముందే చెప్పి వుంచాను. మీరు నిక్షేపంగా రేపటి నుంచి పనిలో చేరవచ్చు" అంటూ దారి తీశాడు. ఇద్దరూ వాకిట్లోకి వచ్చేసరికి ఆకాశం తెల్లగా నిర్మేఘంగా వుంది. చల్లని గాలి హాయిగా వస్తోంది. రకరకాల పక్షులు కర్ణపేయంగా ధ్వనులు చేస్తూ గూళ్లకు ఎగిరిపోతున్నాయి. ❑

# అర్థశాస్త్ర విమర్శ ముందు మాట

**- కార్ల్ మార్క్స్**



పెట్టుబడి, భూ సంపద, కూలి పని, రాజ్యాంగ యంత్రం, విదేశీ వాణిజ్యం, ప్రపంచ మార్కెట్ : ఈ వరసలో నేను బూర్జువా ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తాను.

ఆధునిక బూర్జువా సమాజం మూడు పెద్ద వర్గాలుగా విడివడి ఉంది. ఆ వర్గాల జీవన ఆర్థిక పరిస్థితుల్ని పెట్టుబడి, భూసంపద, కూలి పని అనే శీర్షికల కింద పరిశీలిస్తాను. వీటితో రాజ్యాంగ యంత్రానికీ విదేశీ వాణిజ్యానికీ ప్రపంచ మార్కెట్టుకీ ఉన్న అంతస్సంబంధం స్వయం విదితమే. మొదటి పుస్తకం మొదటి భాగంలో పెట్టుబడి శీర్షిక కింద ఈ అధ్యాయాలుంటాయి. 1. సరుకు 2. డబ్బు లేదా చలామణి 3. స్థూలంగా పెట్టుబడి. ప్రస్తుత భాగంలో మొదటి రెండు అధ్యాయాలుంటాయి. మొత్తం విషయమంతా రాత ప్రతుల రూపంలో నా ముందుంది. వేర్వేరు అంశాలపైన వేర్వేరు సమయాల్లో రాసి పెట్టుకొన్న రాత ప్రతులివి. వీటిలో ఒక దానికీ మరో దానికీ మధ్య ఎంతో విరామం ఉంది. ఇవి ప్రచురణ కోసం ఉద్దేశించినవి కావు. కేవలం సొంత స్పష్టతని సాధించడం కోసం రాసుకొన్నవి. నేను ఇంతకు ముందు సూచించిన పథకం ప్రకారం వీటిని ఒకే మొత్తంగా మలుచుకోవాలి. ఆ పని పరిస్థితులపై ఆధారపడి ఉంది.

నేను అంతకు ముందు స్థూలంగా ఓ పరిచయం రాశాను. కాని ఆలోచించగా రుజువు చేయాల్సిన ఫలితాన్ని ముందే ఊహించినట్టుగా ఉంటుందనీ పాఠకునికి అది గందరగోళంగా ఉంటుందనీ అనిపించింది. అందుకే దాన్ని తొలగించాను. పైగా నన్ను అనుసరించాలనుకొనే పాఠకుడు ప్రత్యేకం నుంచి సామాన్యం వైపు ముందుకు సాగటానికి నిర్ణయించుకోవాలి. నా రాజకీయ అర్థశాస్త్ర అధ్యయనం గురించి ఇక్కడ రెండు ముక్కలు చెప్పడం సబబుగా ఉంటుంది.

నేను న్యాయశాస్త్రం చదివాను. ప్రధాన విషయంగా కాదు; తత్వశాస్త్రానికీ చరిత్రకీ అనుబంధంగానే దాన్ని అధ్యయనం చేశాను. 1842-43లో రైన్ పత్రిక (Rheinische Zeitung) కి సంపాదకుడిగా భౌతిక ప్రయోజనాల గురించి చర్చించాల్సి వచ్చింది. అటవీ దొంగతనాల గురించీ భూ కమతాల విభజన గురించీ రైన్ పార్లమెంటు (Rhenish Landtag)లో చర్చలు జరిగాయి. వాటిని అధికారికంగా రైన్ రాష్ట్ర గవర్నర్ శ్రీమాన్ స్కాపర్ (Herr von Schaper, the Oberprasident) మా పత్రికకు వ్యతిరేకంగా చర్చ ప్రారంభించారు. చివరికి ఆ చర్చలు స్వేచ్ఛా వాణిజ్యం వైపూ రక్షణ సుంకాల వైపూ తిరిగాయి. అప్పుడు నేను బాగా ఇబ్బంది పడ్డాను. నేను వెంటనే మొదటి చర్యగా, ఆర్థిక సమస్యల వైపు దృష్టి మళ్లించాను. వాస్తవ పరిజ్ఞానానికి బదులు సదుద్దేశాలతోనే ముందుకు నెట్టే ధోరణి ఆనాటి రైన్ పత్రికలో మీకు కనిపిస్తుంది. కొద్దిగా తాత్వికతను అద్దిన ఫ్రెంచి సోషలిస్టు, కమ్యూనిస్టు ధోరణులకిది ప్రతిధ్వని. ఇలా పైపై పరిజ్ఞానంతో వ్యవహరించడం నాకు ఇష్టం లేదు. ఫ్రెంచి సిద్ధాంతాల సారాంశంపై వ్యాఖ్యానించడానికి ఇంతవరకూ నేను చేసిన అధ్యయనం చాలదని ఆగ్స్‌బర్గర్ దినపత్రిక (Allgemeine Augsburger Zeitung) తో సాగిన వివాదంలో నేను నిర్మొహమాటంగా అంగీకరించాను. పాలకులకు మరింత ఆమోదయోగ్యమైన విధానాన్ని అనుసరించడం ద్వారా రైన్ పత్రికకు వారు విధించిన మరణ శిక్షను రద్దు చేయించగలమని ప్రచురణకర్తలు అప్పుడు భ్రమ పడ్డారు. ఆ అవకాశాన్ని నేను ఆత్రంగా స్వీకరించాను. పదవికి రాజీనామా చేసి వెంటనే అధ్యయనానికి మరలాను.

నన్ను పీడిస్తున్న సందేహాలను తీర్చుకోవడంలో నేను చేసిన మొదటి పని హెగెల్ న్యాయ తాత్వికతను విమర్శనాత్మకంగా తిరిగి పరిశీలించడమే. 1844లో పారిస్‌లో వెలువడిన జర్మన్ ఫ్రెంచి వార్షిక సంచిక (Deutsch-Franzosische

**కంటికి కన్నే సిద్ధాంతమైతే ప్రపంచం అంతా గుడ్డిది అవుతుంది**

Jahrbucher) లో దాని ముందు మాట ప్రచురించాం. చట్టపరమైన సంబంధాలు గాని, రాజకీయ రూపాలు గాని వాటంతట అవే అర్థం కావు. మానవ మేధ సార్వత్రిక అభివృద్ధి అనబడే పునాదిపై కూడా అవి అర్థం కావు. అవి నిజానికి భౌతిక జీవన పరిస్థితుల్లో పుడతాయి. ఇది నా అధ్యయనంతో నేను చేరుకొన్న నిర్ధారణ. పద్దెనిమిదో శతాబ్దపు ఇంగ్లీషు, ఫ్రెంచి మేధావుల మాదిరిగానే హెగెల్ ఈ పరిస్థితులన్నిటినీ కలిపి పౌర సమాజం అన్నాడు. అయితే ఈ పౌర సమాజపు అవయవ నిర్మాణాన్ని రాజకీయ ఆర్థిక రంగంలో వెదకాలి. కనుక, నేను రాజకీయ అర్థశాస్త్ర అధ్యయనాన్ని పారిస్‌లో మొదలుపెట్టాను. పారిస్ నుంచి నన్ను బహిష్కరించాలన్న గిజో తాకీదు వల్ల నేను బ్రసెల్స్‌కి మకాం మార్చాను అక్కడ కూడా ఈ అధ్యయనాన్ని కొనసాగించాను. దాని వల్ల నేను కొన్ని నిర్ధారణలకు వచ్చాను. నా తర్వాతి అధ్యయనాలన్నింటికీ మార్గదర్శక సూత్రాలు అవే. వాటిని ఇలా చెప్పొచ్చు.

మనుషులు తమ మనుగడకి అవసరమైన సామాజిక ఉత్పత్తిలో ఒకరితో ఒకరు నిర్దిష్ట సంబంధాలు ఏర్పరచుకొంటారు. వారి అభీష్టానికి ప్రమేయం లేని సంబంధాలవి. వాటిని ఉత్పత్తి సంబంధాలు అంటారు. ఆనాటి భౌతిక ఉత్పత్తి శక్తుల స్థాయికి అవి తగినట్టుగా ఉంటాయి. ఈ ఉత్పత్తి సంబంధాల మొత్తంలోనే సమాజపు ఆర్థిక నిర్మాణం ఉంటుంది. ఇది ఆ సమాజానికి పునాది. దీని పైన న్యాయ సంబంధమైన, రాజకీయ పరమైన ఉపరినిర్మాణం ఉంటుంది. సామాజిక చైతన్యానికి చెందిన నిర్దిష్ట రూపాలు దానికి అనుగుణంగా ఉంటాయి. భౌతిక జీవన పరిస్థితుల ఉత్పత్తి విధానమే సామాజిక, రాజకీయ, భౌతిక జీవన క్రమాన్ని రూపొందిస్తుంది. మానవుల మనుగడను శాసించేది, మానవుల చైతన్యం కాదు. వారి సామాజిక అస్థిత్వమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. ఒకానొక అభివృద్ధి దశలో సామాజిక భౌతిక ఉత్పత్తి శక్తులు అప్పటికి ఉన్న ఉత్పత్తి సంబంధాలతో ఘర్షణ పడతాయి. చట్టపరంగా చెప్పాలంటే, ఉత్పత్తి సంబంధాలంటే ఆస్తి సంబంధాలే. వీటి పరిధిలోనే ఉత్పత్తి శక్తులు పని చేస్తాయి. ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి అప్పటి వరకూ దోహదపడిన ఈ సంబంధాలే ఒక దశలో వాటికి సంకెళ్లుగా మారతాయి. అప్పుడే ఒక సామాజిక విప్లవ యుగం మొదలవుతుంది. ఆర్థిక పునాదిలో మార్పులు త్వరగానో, నెమ్మదిగానో ఉపరినిర్మాణంలో కూడా మార్పులకు దారి తీస్తాయి.

అటువంటి పరిణామాలను అధ్యయనం చేసేటప్పుడు ఉత్పత్తికి సంబంధించిన ఆర్థిక పరిస్థితుల్లో వచ్చే భౌతిక మార్పుల్నీ భావజాలంలో వచ్చే మార్పుల్నీ వేరు చేసి చూడాలి. ఈ భౌతిక మార్పుల్ని ప్రకృతి శాస్త్రాలలో లాగా ఖచ్చితంగా కొలవవచ్చు. భావజాల రూపాలు అంటే న్యాయ, రాజకీయ, మత, కళ, తాత్విక తదితర రూపాలు. ఈ రూపాల్లోనే మనుషులు ఈ ఘర్షణ గురించి చైతన్యవంతులవుతారు; వాదించుకొంటారు, తేల్చుకొంటారు.

ఒక వ్యక్తి తన గురించి తాను అనుకొనేదాన్ని బట్టి అతడిని అంచనా వెయ్యం. అలాగే ఒక పరిణామ దశని దాని చైతన్యాన్ని బట్టి అంచనా వెయ్యం. ఆ చైతన్యాన్నే ఆనాటి భౌతిక జీవితంలో ఉన్న వైరుధ్యాలని బట్టి, ఆనాటి సామాజిక ఉత్పత్తి శక్తులకీ ఉత్పత్తి సంబంధాలకీ మధ్య ఉన్న ఘర్షణ బట్టీ వివరించాలి. ఏ సామాజిక వ్యవస్థ అయినా అప్పటికి అభివృద్ధి చెందిన ఉత్పత్తి శక్తులన్నిటికీ సరిపోతున్నంత వరకూ అది కూలిపోదు. ఉన్నతమైన కొత్త సంబంధాలకి అవసరమైన భౌతిక పరిస్థితులు పాత వ్యవస్థ చట్రంలోనే పరిణితి చెందాలి. అలా జరగనంత వరకూ కొత్త సంబంధాలు పాత సంబంధాలను తొలగించలేవు.

మానవజాతి తాను పరిష్కరించగలిగిన కర్తవ్యాలనే స్వీకరిస్తుంది. శ్రద్ధగా పరికిస్తే ఒక అంశం తెలుస్తుంది. ఒక సమస్యను పరిష్కరించడానికి అవసరమైన భౌతిక పరిస్థితులు ఏర్పడినాకనే, కనీసం ఏర్పడే క్రమంలో ఉన్నప్పుడే ఆ సమస్య తలెత్తుతుంది. ఆసియాటిక్, ప్రాచీన, ఫ్యూడల్, ఆధునిక బూర్జువా ఉత్పత్తి విధానాలు సామాజిక ఆర్థిక అభివృద్ధి క్రమంలో ప్రగతి మార్గాన్ని సూచించే యుగాలని స్థూలంగా చెప్పవచ్చు. బూర్జువా ఉత్పత్తి విధానం అనేది, సామాజిక ఉత్పత్తి క్రమంలో ఆఖరి శత్రు రూపం. శత్రుత్వం అంటే వ్యక్తిగతమైన శత్రుత్వం కాదు. అది వ్యక్తి బతుకుతున్న సామాజిక పరిస్థితి నుంచి తలెత్తే శత్రుత్వం. అయితే, ఈ శత్రుత్వ పరిష్కారానికి అవసరమైన భౌతిక పరిస్థితుల్ని బూర్జువా సమాజంలో అభివృద్ధి చెందుతున్న ఉత్పత్తి శక్తులే పుట్టిస్తాయి. కనుక ఈ సామాజిక వ్యవస్థతో పాటు మానవజాతి చరిత్ర పూర్వ దశ కూడా అంతమవుతుంది.

**శ్రామికులకు జీవన వేతనమే కాదు రోజువారీ బండచాకిరీ నుండీ విముక్తి కావాలి**

ఫ్రెడరిక్ ఏంగెల్స్ కూడా వేరే మార్గంలో నేను చేరుకున్న నిర్ధారణలకే వచ్చాడు. అందుకు రుజువుగా ఆయన రాసిన ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితులు (Lage der arbeitenden Klasse in England) గ్రంధాన్ని చూడొచ్చు. ఏంగెల్స్ ఎంతో ప్రజ్ఞావంతంగా రాసిన అర్ధశాస్త్ర రేఖాచిత్రణ అనే వ్యాసం జర్మన్ ఫ్రెంచి వార్షిక సంచికలో ప్రచురించిన నాటి నుంచీ నేను ఆయనతో నిరంతరాయంగా జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో నా భావాలను ఎప్పటికప్పుడు ఆయనతో పంచుకొన్నాను. 1945 వసంత కాలంలో ఏంగెల్స్ కూడా బ్రసెల్స్‌లో ఉంటానికి వచ్చేశాడు. జర్మన్ తాత్విక భావజాలానికి వ్యతిరేకంగా మేమిద్దరమూ మా నిర్ధారణలను నిలపాలని నిర్ణయించుకొన్నాం. తద్వారా మా పాత తాత్విక అంతరాత్మతో తెగతెంపులు చేసుకోవాలనుకొన్నాం. హెగెల్ తర్వాతి తాత్విక ధోరణుల విమర్శ (జర్మన్ ఐడియాలజీ) రాతప్రతిని వెస్ట్‌ఫాలియాలోని ప్రచురణకర్తలకు చాలా కాలం క్రితమే పంపించాం. పరిస్థితులు మారిపోవడం వల్ల దానిని తాము ప్రచురించలేమని వారు తెలియజేశారు. మా ప్రధాన ఉద్దేశ్యం స్వీయ స్పష్టత. అది నెరవేరింది కనుక ఆ రాతప్రతిని ఎలుకల కొరుకుడు విమర్శకు మేము కావాలనే వదిలేశాం. ఆ వేళ మా వేర్వేరు రచనల్లో మేము మా భావాల్లో ఏదో ఒక అంశాన్ని పొందుపరిచాం. ఏంగెల్సూ నేను కలిసి రచించిన కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, నేను ప్రచురించిన స్వేచ్ఛా వాణిజ్యంపై నా ఉపన్యాసమూ అందుకు ఉదాహరణలు. మా భావనలోని ప్రధానమైన అంశాలను మొట్టమొదట నేను రాసిన తాత్విక దారిద్ర్యంలో పొందుపర్చాను. వాగ్వివాదంతో నిండినదే అయినా ఇది విద్యా విషయకమైనది. దీని లక్ష్యం ప్రూధాన్. 1847లో ఇది వెలువడింది. బ్రసెల్స్‌లో జర్మన్ కార్మిక సంఘం సభల్లో కూలిపనిపై నా ప్రసంగాలను కలిపి కూలిపని – పెట్టుబడి అనే పేరుతో ప్రచురించాలనుకొన్నాం. కాని ఈలోగా ఫిబ్రవరి విప్లవం వచ్చింది. అందువల్లనే బ్రసెల్స్ నుంచి నన్ను బహిష్కరించారు. ప్రచురణకు అంతరాయం వచ్చింది. 1848–49లో కొత్త రైన్ పత్రిక (Neue Rheinische Zeitung) నిర్వహణ వల్ల, ఇతర సంఘటనల వల్ల నా అర్ధశాస్త్ర అధ్యయనం కుంటుపడింది. నేను లండన్ చేరుకొన్నాక, 1850లో మాత్రమే దానిని తిరిగి కొనసాగించగలిగాను.

బూర్జువా సమాజాన్ని పరిశీలించడానికి లండన్ చాలా అనువైన స్థానం. కాలిఫోర్నియాలోనూ ఆస్ట్రేలియాలోనూ బంగారాన్ని కనుక్కోవడంతో ఈ సమాజం ఒక కొత్త అభివృద్ధి దశలో ప్రవేశిస్తున్నట్టు కనిపిస్తోంది. అంతేకాక అక్కడి బ్రిటీష్ మ్యూజియంలో రాజకీయ అర్ధశాస్త్రం గురించి బండెడు సమాచారం దొరుకుతుంది. మళ్లీ మొదటినుంచీ అర్ధశాస్త్ర అధ్యయనాన్ని కొనసాగిస్తూ కొత్త సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించేలా పై అంశాలన్నీ నన్ను పురమాయించాయి. ఈ అధ్యయనం దానంతటదే కొంత మేరకు, వేరే ఆర్థికేతర విషయాల అధ్యయనానికి దారి తీసింది. వాటిపైన కూడా నేను కొంత సమయాన్ని వెచ్చించాల్సి వచ్చింది. నేను బతకడం కోసం సంపాదించాల్సిన తప్పనిసరి అవసరం వల్ల కూడా నా సమయం మరికొంత తగ్గింది. ఇప్పటికి ఎనిమిది ఏళ్ల నుంచీ ప్రముఖ ఆంగ్లో అమెరికన్ పత్రిక న్యూయార్క్ ట్రిబ్యూన్‌లో నేను రాస్తున్నాను. దీనంతటివల్లా నా అధ్యయనాన్ని ముక్కలుగా విడగొట్టక తప్పలేదు. బ్రిటన్‌లోనూ ఇతర యూరపు దేశాల్లోనూ జరిగిన ప్రధాన ఆర్థిక సంఘటనలపై నేను రాసినవే, మొత్తంగా నేను రాసిన వాటిలో అత్యధికం. నిజానికి, రాజకీయ అర్ధశాస్త్ర పరిధిలో రోజువారీ ఆర్థిక జీవితానికి సంబంధించిన వివరాలుండవు. అయినప్పటికీ నా వ్యాసాల కోసం ఆ వివరాలను క్షుణ్ణంగా తెలుసుకోక తప్పలేదు.

నా అభిప్రాయాలను ఎవరు ఎలా స్వీకరించినప్పటికీ, పాలక వర్గాల అభిప్రాయ దురభిప్రాయాలకు అవి ఎంత తక్కువ అనుకూలంగా ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి చిత్తశుద్ధితో చేసిన పరిశోధన కారణంగా మాత్రమే నాకు లభించిన ఫలితాలు అవి అని చూపించడానికే రాజకీయ అర్ధశాస్త్ర రంగంలో నా అధ్యయన చిత్రాన్ని మీ ముందుంచాను. నరక ద్వారం దగ్గర మాదిరిగానే శాస్త్ర ద్వారం దగ్గర కూడా ఈ ఆదేశం తప్పదు.

ఇక్కడే నీ అపనమ్మకాలన్నిటినీ వదిలెయ్ !

ఇక్కడే నీ పిరికితనమంతా ఖతమైపోనీ !!

(Divina Commedia లో డాంటే)

**కార్ల్‌మార్క్స్, లండన్, జనవరి 1859** ❑

**దారిద్ర్యం అనేది హింసకు అతి క్రూరమైన రూపం**

# న్యాయమైన రోజు పనికి న్యాయమైన రోజు కూలి



- ఎంగెల్స్

యిది గత యాభై సంవత్సరాలుగా యింగ్లీషు కార్మిక వర్గ ఉద్యమ నినాదంగా ఉంది. 1824లో సంఘాలను గురించిన అపకీర్తికరమైన చట్టాలు రద్దు చేయబడిన తర్వాత ట్రేడ్ యూనియన్లు తలయెత్తుతున్న కాలంలో యిది బాగా ఉపయోగపడింది. యశోదీప్తమైన చార్టిస్టు ఉద్యమ కాలంలో, ఇంగ్లీషు కార్మికులు యూరపియన్ కార్మికవర్గపు అగ్రభాగాన నడిచినప్పుడు, యిది యింకా బాగా ఉపయోగబడింది. కానీ, కాలం ముందుకు పోతున్నది. యాభై యేండ్ల క్రితం, ముప్పై యేండ్ల క్రితం కూడా, వాంఛనీయమూ, అవసరమూ అయిన యెన్నో విషయాలు యిప్పుడు పాతబడిపోయినాయి, అవి పూర్తిగా అసందర్భంగా వుంటాయి. యీ పాత, సంప్రదాయ సన్నుతమైన నినాదం కూడా వాటిలో చేరుతుందా ?

న్యాయమైన రోజు పనికి న్యాయమైన రోజు కూలా ? మరి, న్యాయమైన రోజు పని యేది? న్యాయమైన రోజు కూలి యేది? యే నియమాలతో ఆధునిక సమాజం మన్నుతూ, తన్ను తాను అభివృద్ధి చేసుకుంటున్నదో, ఆ నియమాల చేత యివి యెలా నిర్ణయింపబడతాయి? దీనికి జవాబు కొరకు మనం నీతిశాస్త్రానికి గానీ, న్యాయశాస్త్రానికి గానీ, మానవతా భావానికి గానీ, న్యాయ దృష్టికి గానీ, చివరకు ధర్మబుద్ధికి గానీ విజ్ఞప్తి చేయకూడదు. నైతికంగా న్యాయమైనది, న్యాయశాస్త్ర దృష్ట్యా న్యాయమైనది కూడా, సాంఘికంగా న్యాయం కాకుండా వుండవచ్చు. సాంఘికన్యాయం లేదా సాంఘిక అన్యాయం ఒకే ఒక శాస్త్రం చేత మాత్రమే నిర్ణయింపబడుతుంది. ఉత్పత్తి, మారకాలకు సంబంధించిన శాస్త్రం చేత, అనగా అర్థశాస్త్రం చేత.

మరి, అర్థశాస్త్రం దేనిని న్యాయమైన రోజు కూలి అనీ, న్యాయమైన రోజు పని అనీ అంటుంది? బహిరంగ మార్కెట్‌లో యజమానికీ, కూలివానికీ మధ్య వున్న పోటీ చేత నిర్ణయింపబడిన కూలి రేటూ, రోజు పని యొక్క దైర్ఘ్యమూ, తీవ్రతా మాత్రమే. మరి, అలా నిర్ణయింపబడినప్పుడు, అవి యేమిటి ?

మామూలు పరిస్థితులలో న్యాయమైన రోజు కూలి అంటే, శ్రామికుని స్థాయి యొక్కా, దేశం యొక్కా జీవన ప్రమాణాన్ని అనుసరించి, తన్ను తాను పనిచేసే స్థితిలో వుంచుకోవడానికీ, వంశ వృద్ధికీ అవసరమైన తిండి తీర్థాలను అతనికి యివ్వగల మొత్తం. వర్తకపు యెగుడుదిగుడుల మూలంగా, వాస్తవంలో వుండే కూలి రేటు యీ రేటు కంటే ఒక్కోసారి యెక్కువగానూ, ఒక్కోసారి తక్కువగానూ వుండవచ్చు. కానీ, న్యాయమైన పరిస్థితులలో ఆ రేటు సకల యెగుడుదిగుడుల సరాసరిగా వుండాలి.

న్యాయమైన రోజు పని అంటే, కార్మికుని ఒక రోజు యొక్క పూర్తి శ్రమ శక్తిని ఖర్చు చేసేటంత దీర్ఘమైన పనిదినమూ, అంత తీవ్రత గల వాస్తవమైన పనీ – మరుసటి రోజూ, ఆ తరువాతి రోజులూ అదే మొత్తం పనిచేయడానికి అతనికి గల సామర్థ్యం మీద దెబ్బ తీయకుండా వుండేవి.

కనుక యీ బేరాన్ని యీ విధంగా వర్ణించవచ్చు. కార్మికుడు పెట్టుబడిదారునికి తన పూర్తి రోజు యొక్క శ్రమశక్తిని యిస్తాడు; అనగా, యీ బేరం యొక్క నిరంతరాయ పునశ్చరణను అసాధ్యం చేయకుండా అతను యెంత యివ్వగలడో అంత. దీనికి బదులుగా అతను పొందేది యేమిటంటే, ప్రతిరోజూ యిదే బేరం యొక్క పునశ్చరణను సాగించడానికి అవసరమైనంత, అంతకంటె యే మాత్రమూ యెక్కువ కాని, జీవితావసరం వస్తువులు. బేరం యొక్క స్వభావం యెంత ఎక్కువ అనుమతిస్తుందో అంత కార్మికుడూ, యెంత తక్కువ అనుమతిస్తుందో అంత పెట్టుబడిదారుడూ యిస్తారు. యిది చాలా చిత్రమైన న్యాయం.

కానీ, యీ విషయంలోకి మరింత లోతుగా చూద్దాం. అర్థశాస్త్రజ్ఞుల ప్రకారం వేతనాలూ, పనిదినాలూ పోటీ చేత

**అజ్ఞాపించే ముందు నీవు ఆచరించు**

నిర్ణయింపబడతాయి గనుక, ప్రారంభంలో యిరు పక్షాలకూ సమాన షరతులు వుండడం న్యాయంగా కనపడుతుంది. కానీ అలా వుండడం లేదు. పెట్టుబడిదారుడు, కార్మికునితో అంగీకారానికి రాలేకపోతే, ఆగి, తన పెట్టుబడి మీద బతకగలడు. కార్మికుడు అలా చేయలేడు. అతనికి బతకడానికి కూలి మాత్రమే వుంది. కనుక అతను యెప్పుడు, యెక్కడ, యే షరతుల మీద పని సంపాయించుకోగలిగితే అప్పుడు, అక్కడ, ఆ షరతుల మీద పనిని తీసుకోవాలి. ప్రారంభంలోనే కార్మికుడు ప్రతికూల పరిస్థితిలో వున్నాడు. అతనికి ఆకలి అనే భయంకరమైన అసౌకర్యం వుంది. కానీ, పెట్టుబడిదారీ వర్గ అర్థశాస్త్ర ప్రకారం, అది న్యాయానికి పరాకాష్ఠ.

కానీ, యిది కేవలం స్వల్ప విషయం. యాంత్రిక శక్తినీ, యంత్రాలనూ నూతన వృత్తులకు ప్రయోగించడమూ, అప్పటికే వాటికి గురి అయిన వృత్తులలో యంత్రాల విస్తరణా, మెరుగుదలలూ అంతకంతకూ యెక్కువ "చేతుల"ను నిరుద్యోగులనుగా చేస్తూ వుంటాయి; యీ తొలగింపబడిన "చేతులు" దేశంలోని ఉత్పత్తులలో లీనం చేసుకోబడి, ఉద్యోగం సంపాయించగలగడం కంటే యెంతో వేగంగా అవి వాళ్లను నిరుద్యోగులనుగా చేస్తూ ఉంటాయి. యీ తొలగింపబడిన "చేతులు" పెట్టుబడి ఉపయోగార్థం నిజమైన రిజర్వు పారిశ్రామిక సైన్యంగా ఏర్పడతాయి. వర్తకం అధ్వాన్నంగా వుంటే, వాళ్లు పస్తు వుండవచ్చు. బిచ్చమెత్తుకోవచ్చు, దొంగిలించవచ్చు, లేదా వర్క్ హౌస్‌కు పోవచ్చు. వర్తకం బాగుంటే, ఉత్పత్తిని విస్తరించడానికి వాళ్లు అందుబాటులో వుంటారు. యీ రిజర్వు సైన్యంలోని చివరి పురుషునికీ, స్త్రీకీ లేదా బాలునికీ, బాలికకూ పని దొరికిందాకా – ఆదుర్దాతో కూడిన అధికోత్పత్తి సమయాలలో మాత్రమే అలా దొరుకుతుంది. అందాకా యీ సైన్యపు పోటీ వేతనాలను తగ్గించి వుంచుతుంది; కేవలం తన ఉనికి వల్లనే, శ్రమతో పెట్టుబడి చేసే పోరాటంలో, పెట్టుబడి శక్తిని బలీయం చేస్తుంది. పెట్టుబడితో జరిగే పరుగు పందెంలో శ్రమకు అసౌకర్యం వుండడమే కాదు, అది తన కాలికి అతికించబడిన ఫిరంగి గుండును లాగవలసి వుంది. కానీ, పెట్టుబడిదారీ అర్థశాస్త్రం ప్రకారం అది న్యాయం.

మరి, యీ న్యాయమైన వేతనాలను పెట్టుబడిదార్లు యే నిధి నుండి చెల్లిస్తారో తెలుసుకుందాం. సహజంగానే, పెట్టుబడి నుండి. కానీ, పెట్టుబడి యే విలువనూ ఉత్పత్తి చేయదు. భూమి కాక, శ్రమ ఒక్కటే సంపదకు మూలం. పెట్టుబడి అనేదే శ్రమ యొక్క కూడబెట్టబడిన ఉత్పత్తి తప్ప మరేమీ కాదు. అనగా శ్రమ యొక్క వేతనాలు శ్రమ నుండి చెల్లింపబడతాయి, కార్మికుడు తన ఉత్పత్తి నుండే చెల్లింపబడతాడు. మామూలు న్యాయం అనబడే దాని ప్రకారం, శ్రామికుని శ్రమ యొక్క ఉత్పత్తి అతని కూలిగా వుండాలి. కానీ, అర్థశాస్త్రం ప్రకారం అది న్యాయం కాదు. తద్వ్యతిరేకంగా, కార్మికుని శ్రమ యొక్క ఉత్పత్తి పెట్టుబడిదారునికి పోతుంది, కార్మికునికి కేవల జీవితావసర వస్తువుల కంటే యెక్కువ యేమీ రాదు. యీ విధంగా, పోటీ అనే యీ అసాధారణంగా "న్యాయమైన" పరుగుపందెపు అంతం యేమిటంటే, పని చేసే వాళ్ల శ్రమ ఉత్పత్తి పని చేయనివాళ్ళ చేతుల్లో అనివార్యంగా ప్రోగై, వాళ్ళ చేతుల్లో, దానిని ఎవరు ఉత్పత్తి చేసినారో అదే మనుషులనే బానిసలను చేయడానికి అత్యంత శక్తివంతమైన సాధనంగా తయారవుతుంది.

న్యాయమైన రోజు పనికి న్యాయమైన రోజు కూలి! న్యాయమైన రోజు పనిని గురించి కూడా చాలా చెప్పవచ్చు. దాని న్యాయం కూలి యొక్క న్యాయానికి సంపూర్ణంగా సమాన స్థాయిలో వుంది. కానీ దానిని మరొకసారి చూద్దాం. యిప్పుడు చెప్పిన దాన్ని బట్టి, పాత నినాదానికి కాలం తీరిందనీ, ప్రస్తుతం వర్తించదనీ చాలా స్పష్టపడుతున్నది. అర్థశాస్త్రం యొక్క న్యాయం, వాస్తవ సమాజాన్ని పాలించే నియమాలను నిజంగా నిర్ణయించడానికి సంబంధించిన న్యాయం, ఆ న్యాయం అంతా ఒక పక్షాన వుంది. పెట్టుబడి పక్షాన. కనుక, పాత నినాదం శాశ్వతంగా పూడ్చిపెట్టబడనీ, దాని స్థానంలో యీ మరొక సూత్రం రానీ; శ్రమ సాధనాలు – ముడి సరుకులూ, ఫ్యాక్టరీలూ, యంత్రాలూ – కార్మికులకే చెందడం. ❑

**పరమత సహనంతోనే జాతి ఐక్యత**

RNI Regn No. 52879/93

*With best compliments from*

# JAN AUSHADHI

## GENERIC MEDICAL STORE

***Branded Generics at most Reasonable Price***

Opp. Z.P. Boys High School

**TANUKU**

**✆ 96030 53292**



*S. Ramana Bhaskar Rao*



*A.N.S. Satyanarayana*

***Organised by :***

**Jeevandhara Pharmacy Senior Citizens Trust**

**Sajjapuram, TANUKU - 534 211**

**email : Satyaboudha@gmail.com**

**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao** at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : D V V S Varma**